News Daily
ఎడిటర్ : B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :13 | ఖమ్మం | సోమవారం మార్చి 3, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad





- వనపర్తిలో నేడు ప్రజా పాలన-ప్రగతి బాట బహిరంగ సభ
- కేసీఆర్ సంతకం యమపాశమైంది
- కృష్ణా జలాల్లో 511 టీఎంసీలు ఏపీకి ఇచ్చింది ఆయనే
- రాష్ట్ర ప్రజలపై కిషన్‌రెడ్డి పగబట్టారు
- వనపర్తిని అభివృద్ధి పథంలో నిలిపే బాధ్యత నాది
- ప్రజాపాలన-ప్రగతిబాట సభలో సీఎం రేవంత్‌రెడ్డి

# తెలంగాణకు భారాస, భాజపా ఏం చేశాయి..?

## ఏదో ఒకటి చేయాలని మోదీ అనుకున్నా... కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారు: రేవంత్ రెడ్డి

**ఆడబిడ్డలు ఆశీర్వదిస్తే రాబోయే 15, 20 ఏళ్లు రేవంత్‌రెడ్డి సీఎంగా కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని, అప్పుడు తమ బతుకు బస్టాండు అవుతుందని.. భాజపా, భారాస వాళ్లు భయపడి మాపై అబద్ధాలు చెబుతున్నారు. మేం 24 గంటలూ కష్టపడుతుంటే ఆ పార్టీలు మాపై బండలేస్తున్నాయ్ -సీఎం రేవంత్**

కృష్ణా జలాల్లోని 811 టీఎంసీల్లో 511 టీఎంసీలు ఏపీకి తీసుకెళ్లవచ్చంటూ.. నాడు కేసీఆర్ పెట్టిన సంతకం తెలంగాణ రైతుల పాలిట యమపాశమైందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాయలసీమకు నీటిని తరలించడానికి కేసీఆర్ కారణం కాదా అని ప్రశ్నించారు. నాడు పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచి వై.ఎస్. సీమకు నీరు తీసుకెళితే.. తరువాత ఆయన కుమారుడు జగన్ ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాటి తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌కు పిలిచి పంచభక్ష్య పరమాన్నాలు పెట్టి రాయలసీమ ఎత్తిపోతలకు పునాదులు వేయలేదా అని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలమూరు ద్రోహి అని దుయ్యబట్టారు.

వివరాలు 2లో..

# ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాజెక్టును పూర్తి చేస్తాం

- పదేళ్లు ఎస్‌ఎల్‌బీసీని పక్కన పెట్టిన భారాస
- బిల్లులు చెల్లించలేదు.. విద్యుత్ నిలిపివేశారు
- కాళేశ్వరం, దేవాదులలో ప్రమాదాలు జరిగితే నాటి పెద్దలు వెళ్లనేలేదు
- సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు
- సొరంగ ప్రమాదంపై మరో 2,3 రోజుల వరకు ఏమీ చెప్పలేం
- బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని వెల్లడి



శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం (ఎస్ఎల్‌బీసీ) కూలిన ఘటనపై అధికార, ప్రతిపక్షాలు ఐక్యంగా నిలవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోందని, రెండు మూడు రోజుల వరకు ఏ విషయం అధికారికంగా చెప్పలేమని స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలో ప్రమాదం చోటుచేసుకున్న ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని సీఎం ఆదివారం సాయంత్రం పరిశీలించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, బాలూ నాయక్‌లతో కలిసి సొరంగంలోకి వెళ్లి సహాయ చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, జాతీయ, రాష్ట్ర సంస్థలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి విలేకరులతో మాట్లాడారు. "ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును 2005-06లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అధునాతన సాంకేతికతతో టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషిన్) ద్వారా ప్రారంభించింది. దీని తవ్వకం తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావంలోపే 30 కిలోమీటర్ల మే పూర్తయింది. రాష్ట్రం ఏర్పాటయ్యాక ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తారని మేం విశ్వసించాం. కానీ, నాటి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నిర్మాణ సంస్థకు బిల్లులు చెల్లించకపోగా.. విద్యుత్ సరఫరా నిలిపివేసింది. దీంతో పదేళ్ల పాటు పనులు నిలిచిపోయాయి. మా ప్రభుత్వం వచ్చిన వెంటనే

వివరాలు 2లో..

# బీఆర్ఎస్ నుంచి వచ్చిన 10 మంది ఎమ్మెల్యేలు తిరిగి వెళ్లిపోతరు



బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన 10 మంది గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు తిరిగి వెళ్లిపోతారని బీజేపీ నేత, మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. పక్క పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్యేలను సీఎం రేవంత్ రెడ్డి కాపాడుకోలేకపోతు న్నాడని అన్నారు. ఆదివారం (మార్చి 2) హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో రఘునందన్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో పాలన పడకేసిందని.. సీఎం రేవంత్ రెడ్డికి పరిపాలన

వివరాలు 2లో..

# ఉగాది నుంచి గద్దర్ అవార్డులు



సినిమా రంగం లో విశేష ప్రతిభ కనబర్చే వారికి ఇవ్వనున్న గద్దర్ అవార్డులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. వచ్చే ఉగాది నుంచి గద్దర్ ఫిలిం అవార్డులను ప్రదానం చేస్తామని ఆయన తెలిపారు. ఆదివారం (మార్చి 2) హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో శ్రీభక్త రామదాసు జయంతి ఉత్సవాలు నిర్వహించారు. మంత్రి సీతక్క జ్యోతి వెలిగించి

వివరాలు 2లో..

# ఏపీ సర్కార్ కు షాక్: రుషికొండ బీచ్‌కి బ్లూఫ్లాగ్ ట్యాగ్ రద్దు..



ఏపీ సర్కార్ కు షాకిచ్చింది బ్లూ ఫ్లాగ్ ఫౌం డేషన్.. వైజాగ్ రుషికొండ బీచ్ కి బ్లూ ఫ్లాగ్ ట్యాగ్ ను ఉపసంహరించుకుంది ఫౌండేషన్. 2020లో రుషికొండ బీచ్ పరిధిలో 600 మీటర్ల తీర ప్రాంతాన్ని బ్లూ ఫ్లాగ్ బీచ్ గా సర్టిఫై చేసింది డెన్మార్క్ కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్మెంటల్

వివరాలు 2లో..

# స్మగర్లు, దేశద్రోహులను సినిమాల్లో హీరోలుగా చూపిస్తున్నారు



- హైదరాబాదులో నటి, నిర్మాత కృష్ణవేణి సంస్మరణ సభ
- హాజరైన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- హీరోల పాత్రలపై దర్శకులు తీరు మార్చుకోవాలని హితవు
- చెడ్డ పనులను ఎప్పుడూ గొప్పగా చూపించకూడదని సూచన

దేశంలో సినీ రంగం పోకడలపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. సినిమాల్లో హీరో పాత్రల తీరుపై దర్శకులు పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. ఒకప్పుడు సినిమాల ద్వారా ప్రజలకు మంచి సందేశం వెళ్లేదని... ఇప్పుడు స్మగ్లర్లు, దేశ ద్రోహులు, సమాజంలో తప్పుడు విధానాలు పాటించేవాళ్లతో హీరో పాత్రలకు

వివరాలు 2లో..

# వాళ్లిద్దరికీ బుద్ధి లేదు... కనీసం నీకైనా ఉంది అనుకున్నాం పవన్ కల్యాణ్

- ఇటీవల పోసాని అరెస్ట్
- తీవ్రంగా తప్పుబట్టిన లక్ష్మీపార్వతి
- ఇది కక్ష సాధింపు అంటూ ఆగ్రహం



ప్రముఖ సినీ నటుడు పోసాని కృష్ణ మురళిని ఇటీవల రాయచోటి పోలీసులు అరెస్ట్ చేయడం తెలిసిందే. చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, సినీ పరిశ్రమలో వర్గ భేదాలు సృష్టించడం వంటి అనేక ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. ఏపీలో పోసానిపై దాదాపు 11 కేసుల వరకు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో, ఆయన అరెస్ట్ పై వైసీపీ మహిళా నేత లక్ష్మీపార్వతి స్పందించారు. గతంలో నంది అవార్డుల విషయంలో పోసాని మాట్లాడిన దాంట్లో తప్పేమీ లేదని అన్నారు.

వివరాలు 2లో..

# తెలంగాణకు భారాస, భాజపా ఏం చేశాయి?

- మొదటి పేజి తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే ఇందిరమ్మ మహిళా శక్తి తదితర పథకాలను ఆదివారం వనపర్తిలో సీఎం రేవంత్ ప్రారంభించారు. వివిధ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు హాజరైన ఆయన స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రారంభించారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 50 మంది ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ వర్గాల మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన 'ప్రజాపాలన-ప్రగతి బాట' సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితలు నన్ను.. సీఎం పదవి నుంచి దిగుతావా లేదా అని అడుగుతున్నారు. మా పాలమూరుకు మీరు నీళ్లు తెచ్చారా? పదేళ్లుగా మీరు ప్రాజెక్టులు కడితే ఇక్కడి నుంచి వలసలు ఎందుకు ఆగలేదు? భాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్ వరకూ, శ్రీశైలం నుంచి శ్రీరాంసాగర్ వరకూ మా చెమటతో కట్టాం. మీరు నిర్మించిన ప్రాజెక్టు ఏదైనా ఉందా..? ఆర్డీఎస్ ప్రాజెక్టు ఎందుకు ఎండిపోయింది? ఎస్ఎల్‌బీసీ గతంలో కాంగ్రెస్ సర్కారు మొదలుపెట్టి 32 కిలోమీటర్ల తవ్వకం పూర్తిచేస్తే.. మిగిలిన పనులు భారాస పాలనలో నిలిపివేశారు. ఆ కారణంగానే నేడు టన్నెల్ కుప్పకూలి..

8 మంది గల్లంతయ్యారు. ఈ పాపం కేసీఆర్‌ది కాదా? భారాస పాలనలో బడి పిల్లల యూనిఫాంలు కుట్టే పనుల్ని పెద్ద కంపెనీలకు ఇచ్చి కమీషన్లు తీసుకున్నారు. ఇప్పుడు పాఠశాలలు, హాస్టళ్లలో 1.30 కోట్ల జతల దుస్తులు కుట్టించి ఇచ్చే వ్యాపారం మహిళలకు ఇచ్చాం. 4.50 లక్షల ఇళ్లు పేద ఆడబిడ్డల పేరుమీద ఇస్తున్నాం. గత పదేళ్ల భారాస పాలనలో స్వయంసహాయక సంఘాలు నిర్వీర్యమయ్యాయి. మేం వాటికి రూ.వేల కోట్లు అందించి అభివృద్ధిపథంలో నడిపిస్తున్నాం. గత పదేళ్లు కేసీఆర్ ఆయన ఇంట్లో వాళ్లకి మాత్రమే ఉద్యోగాలిచ్చారు. మేం 55 వేల కొలువులిచ్చాం.

**అభివృద్ధికి కిషన్‌రెడ్డి అడ్డం పడుతున్నారు**

తెలంగాణకు నువ్వేం చేశావని నన్ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడుగుతున్నారు. వరంగల్‌లో ఎయిర్‌పోర్టు నేను కష్టపడి తెస్తే.. తానే తెచ్చానని ఆయన అంటున్నారు. మెట్రో విస్తరణ, మూసీకి నిధులు రాలేదంటే.. ఆపింది ఆయనే కదా.. ఆయన కడుపు నిండా అసూయ, కుళ్లు పెట్టుకుని కాళ్లలో కట్టె పెట్టే పనులు చేస్తున్నారు. కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ హైదరాబాద్‌కు వచ్చి అభివృద్ధి పనులపై సమీక్షిస్తే ఈ ప్రాంత ఎంపీ అయిన కిషన్‌రెడ్డి ఎందుకు డుమ్మా కొట్టారు? మెట్రోను మేడ్చల్ వరకూ పొడిగించాలని ఆ సమావేశంలో ఈటల అడిగింది నిజం కాదా? కర్ణాటకలో ప్రతిపక్షంలో ఉన్న భాజపా నేత శోభ మెట్రో విస్తరణకు అనుమతి తీసుకువెళ్లారు. చెన్నై మెట్రోకు నిర్మలా సీతారామన్ అనుమతిచ్చారు. కానీ హైదరాబాద్ మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని ఆయన ఇంటికి వెళ్లి మరీ అడిగాను. తెలంగాణకు ఏదీ రాకపోవడానికి సమస్య మోదీ కాదు. రాష్ట్రానికి ఏమైనా ఇవ్వాలని ప్రధానికి ఉంది. కానీ కిషన్‌రెడ్డి ఎందుకు అడ్డుపడుతున్నారో తెలియడంలేదు.

**వనపర్తిలో సర్వం నేర్చుకున్నా**

నాకు వనపర్తి.. చదువు.. సంస్కారం నేర్పి విద్యార్థి రాజకీయాల్లో చైతన్యం ఇచ్చింది. ఇక్కడ సర్వం నేర్చుకున్నా. వనపర్తి పట్టణాన్ని, నియోజకవర్గాన్ని అభివృద్ధిపథం వైపు నడిపి.. గొప్పకీర్తిని తీసుకొస్తాను. ఈ ప్రాంతంలో జైరాములు యాదవ్, బాలకిష్టయ్య, చిన్నారెడ్డి, రావుల చంద్రశేఖరరెడ్డిల మధ్య 4 దశాబ్దాలు సిద్ధాంతపరంగా, అభివృద్ధిపరంగా పోటాపోటీ ఉన్నా అప్పుడు ఎక్కడా రాజకీయకక్షల్లేవు.. అభివృద్ధి చేయడంలో వారు పోటీపడ్డారు. ఐదేళ్ల క్రితం ఇక్కడ ఎమ్మెల్యేగా ఎన్నికైన వ్యక్తి వనపర్తి రాజకీయాలను కలుషితం చేసి కుట్రలకు వేదికగా మార్చి గొప్ప పేరును దెబ్బతీశారు. విద్యార్థి రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంటూ తెలంగాణకు ముఖ్యమంత్రినై ఈరోజు మీ ముందు నిలబడటం నాకు గర్వకారణం. ఈ రోజు రూ.వెయ్యికోట్ల పనులను ప్రారంభించాం. మాజీ ఎమ్మెల్యేలు జయరాములు, బాలకిష్టయ్య, చిన్నారెడ్డి పేర్లను ఈ ప్రాంత ప్రాజెక్టులకు పెడతాం. పాలమూరును పసిడి పంటల జిల్లాగా మార్చే బాధ్యత నాది. 25 లక్షల ఎకరాలకు నీరు పారించే బాధ్యత తీసుకుంటాను" అని సీఎం హామీ ఇచ్చారు.

# వాళ్లిద్దరికీ బుద్ధి లేదు... కనీసం నీకైనా ఉంది అనుకున్నాం పవన్ కల్యాణ్

- మొదటి పేజి తరువాయి

ఇది అన్యాయం... అవార్డులన్నీ ఓ వర్గం వారికే ఇస్తున్నారు... ఈ అవార్డు నేను తీసుకోను అని పోసాని అనడంలో తప్పేమైనా ఉందా? అని ప్రశ్నించారు.

మన దేశంలో భారతరత్న వంటి అవార్డులను, పద్మ భూషణ్, పద్మశ్రీ అవార్డులు కూడా తిరస్కరించిన వాళ్లు ఉన్నారని వెల్లడించారు. ప్రముఖ గాయని ఎస్.జానకి కూడా గతంలో పద్మభూషణ్ అవార్డును తిరస్కరించారని లక్ష్మీపార్వతి గుర్తుచేశారు. అప్పటి ప్రభుత్వాల తీరు సరిగా లేదన్న కారణంతో అవార్డులు తిరస్కరిస్తున్నామని వారంతా చెప్పారని వివరించారు. "పోసాని కృష్ణమురళి కూడా ఆ విధంగానే తనకు వచ్చిన అవార్డును తిరస్కరించారు. ఈ అవార్డు న్యాయబద్ధంగా రాలేదు... ఇందులో ఒకే వర్గానికి ప్రాధాన్యత కనిపిస్తోందని ఆయన విమర్శించారు. ఆయన ఎప్పుడో విమర్శిస్తే... ఆ విషయాన్ని ఇవాళ తీసుకువచ్చి ఆయనపై కేసు పెట్టారు. ఆయనకు డాక్టర్లు ఎన్ని ఆపరేషన్లు చేశారో మాకు తెలుసు. ఆయనకు నెల రోజుల పాటు గొంతు పోయింది. అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని ఈ విధంగా వేధిస్తున్నారు. ఎక్కడో కేసు పెట్టారు. అది కూడా... మనోభావాలు దెబ్బతిన్నాయట. ఏమయ్యా... మీ వల్ల ఎంతమంది మనోభావాలు దెబ్బతిన్నాయో తెలియదా! మీ వల్ల ఎన్టీఆర్ మనోభావాలు దెబ్బతినలేదా, నా మనోభావాలు దెబ్బతినలేదా... రోజా, జగన్, భారతమ్మ... వీళ్లందరి మనోభావాలు దెబ్బతినలేదా? మీరు సాగించిన అకృత్యాలు, అరాచకాలు, అన్యాయాలు... అన్నీ ఇన్నీ కావు! తప్పులన్నీ మీరే చేస్తారు... పోలీసులపై మీరు చేసిన దాడులు ఎంత భయంకరమైనవో తెలియదా! వాటిపై మాత్రం కేసులు ఉండవు... వాటన్నింటినీ కొట్టేయించుకుంటారు. ఇవాళ తనకు అవార్డు వద్దన్నందుకు పోసానిని ఎక్కడో కడప జిల్లాలోని జైలులో పెడతారు. 65 ఏళ్ల వయసున్న వ్యక్తిని ఇబ్బంది పెడుతున్నారు. అయినా మీకు న్యాయం ఎక్కడుంది? అప్పుడు కూడా 75 ఏళ్ల వయసున్న వ్యక్తిని (ఎన్టీఆర్ ను) అన్యాయంగా గద్దె దించి, ఆయన ప్రాణాలు పోవడానికి కారకులు అయ్యారు. ఈరోజు కూడా... నేను రాజకీయాలకు దూరంగా ఉంటాను అన్న వ్యక్తిని కక్షపూరితంగా అరెస్ట్ చేశారు. పవన్ గారూ... మిమ్మల్ని అడుగుతున్నాను... ఆ రోజు ఆయన భార్యను మీరెంత విమర్శించారండీ! ఏరోజైనా ఆయన భార్య ఇంట్లోంచి బయటికి వచ్చిందా? అటువంటి ఆమెపై కూడా మీ మనుషులను పంపించి నిందలు వేయించారే... ఇప్పుడు కక్ష తీర్చుకోవడానికి ఈ విధంగా చేస్తున్నారా... ఇదేం న్యాయమండీ పవన్ కల్యాణ్ గారూ! కొంచెమైనా మీరు ఆలోచించరా...! ఆ తండ్రీకొడుకులకు (చంద్రబాబు, లోకేశ్) ఎలాగూ బుద్ధి లేదు... కనీసం మీకైనా బుద్ధి ఉందని మేం అనుకుంటున్నాం. కానీ మీరు కూడా ఈ విధంగా ప్రవర్తిస్తుంటే ఇక ప్రజాస్వామ్య వ్యవస్థ ఎటుపోతుందో! రాష్ట్రంలో పూర్తి అరాచకంతో కూడిన వ్యవస్థ, దాష్టీక పరిపాలన కనిపిస్తోంది. ఏపీ ప్రజలకు మీరు ఒరగబెట్టిందేమీ లేదు... అటు వంశీని, ఇటు పోసానిపై.. ఇలా వైసీపీ నేతలపై కేసులు పెట్టుకుంటూ పోతున్నారు" అంటూ లక్ష్మీపార్వతి ధ్వజమెత్తారు.

# ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాజెక్టును పూర్తి చేస్తాం

ఈ ప్రాజెక్టుపై దృష్టి పెట్టింది. సంస్థలకు బిల్లులు చెల్లించి, నిపుణులతో చర్చించాం. అమెరికా నుంచి టీబీఎం, ఇతర పరికరాలను రప్పించాం. పనులు వేగంగా పూర్తిచేసి నల్గొండ నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మేం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే అనుకోకుండా ఈ దుర్ఘటన జరిగింది. బాధితులకు ప్రభుత్వం, ప్రతిపక్షం అంతా అండగా నిలిచి ఆదుకోవాలి.

**దుర్ఘటన జరిగిన గంటలోపే మంత్రులు**

గత నెల 22న ప్రమాదం జరిగిన గంటలోపే మంత్రులు ఉత్తమ్, జూపల్లి ఇక్కడికి చేరుకున్నారు. ప్రభుత్వ వ్యవస్థ అంతా ఇక్కడే ఉండి పనిచేస్తోంది. ప్రతి రెండు మూడు గంటలకు నేను వివరాలు తెలుసుకుంటూనే ఉన్నాను. నిరంతరం ఆర్మీ, మరో 11 సంస్థలు పనిచేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు ఏజెన్సీలు కూడా పాల్గొంటున్నాయి. గల్లంతైన వారి వివరాలు ఇప్పటికీ తెలియరాలేదు. అవిశ్రాంతంగా సహాయ చర్యల్లో పాల్గొంటున్న సంస్థలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. దేశ ప్రధాని నుంచి మొదలు ప్రతిఒక్కరూ వారి సలహాలు, సూచనలు అందించారు. ప్రమాదం జరిగినా.. మేం మనోధైర్యం కోల్పోలేదు. పట్టుదలతో ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. సొరంగంలో ఊట వస్తోందని నిపుణులు చెబుతున్నారు. 13.50 కిలోమీటర్ల దూరంలో పనిచేస్తుండటం క్లిష్టంగా మారింది. సోమవారం సాయంత్రానికి కన్వేయర్ బెల్ట్ మరమ్మతు చేసి మట్టిని బయటకు పంపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మట్టి కింద మనుషులు, యంత్రాలు ఎక్కడ ఉన్నాయనే నిపుణులు ఒక అంచనాకు రాలేకపోతున్నారు.

మేం ఎవరినీ నిందించడం లేదు సొరంగం పైకప్పు కూలిన ఘటనపై కొందరు రాజకీయ ఆరోపణలు చేస్తున్నారు. బురద చల్లే పనిచేస్తున్నారు. కానీ, మేం ఎవరినీ నిందించడం లేదు. మా లోపం ఎక్కడైనా ఉందా? భారాస పరిపాలనలో శ్రీశైలం జల విద్యుత్ కేంద్రంలో అగ్ని ప్రమాదం జరిగితే ఎవరినీ అక్కడికి వెళ్లనివ్వలేదు. నేను పీసీసీ అధ్యక్షుడిగా శ్రీశైలం వెళ్లేందుకు ప్రయత్నిస్తే అరెస్టు చేసి జైల్లో పెట్టారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల్లో మరణాలు సంభవిస్తే నాడు విపక్షాలను రానీయలేదు. ప్రభుత్వ పెద్దలు మాత్రం అక్కడికి వెళ్లనేలేదు. మేం మాత్రం ప్రతిపక్షాలు సొరంగం పరిశీలనకు వస్తే అనుమతించాం. మేం పారదర్శకంగా ఉన్నా మమ్మల్ని తప్పు పట్టాలని చూస్తున్నారు.

**ప్రతిపక్ష నాయకుడు ఎక్కడ?**

ఇంత పెద్ద ప్రమాదం జరిగితే రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడు కె.చంద్రశేఖర్‌రావు ఎక్కడున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఏ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. నేను ఎన్నికల ప్రచారానికి వెళ్లానని విమర్శించిన హరీశ్‌రావు.. సొరంగంలో ప్రమాదం జరిగినప్పుడు దుబాయ్‌లో దావత్ చేసుకోలేదా. కాదంటే పాస్‌పోర్ట్ వివరాలు బయట పెట్టమనండి. లేదంటే నేను బయటపెడతా. దేవాదుల ప్రమాదంలో చిక్కుకున్న వారి మృతదేహాలు ఐదేళ్ల వరకు దొరకలేదు. ఈ విషయాన్ని ప్రతిపక్షం మర్చిపోతే ఎలా? శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలో ప్రమాదం జరిగితే మరమ్మతులు చేయనేలేదు. మానవ తప్పిదంతో నాడు ప్రమాదం జరిగింది. ఎస్ఎల్‌బీసీ ప్రమాదం ప్రకృతి విపత్తు.. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుంది.

**రోబోల వినియోగానికి ఆదేశం**

సొరంగంలో సహాయక చర్యలకు రోబోలను వినియోగించాలని యంత్రాంగాన్ని ఆదేశించాం. ప్రపంచంలో ఎక్కడ ఏరకమైన పరికరాలు, నిపుణులున్నా రప్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే ఎన్జీఆర్ఐ పలుచోట్ల కొన్నింటి ఉనికిని ప్రాథమికంగా గుర్తించింది. ఆ ప్రాంతాలకు ర్యాట్ హోల్ మైనర్స్ వెళ్లారు. కానీ, అక్కడ మనుషుల ఉనికి బయటపడలేదు" అని సీఎం పేర్కొన్నారు.

**కుడి.. ఎడమల నుంచి స్కాన్ చేయండి: ఎన్జీఆర్ఐకు సీఎం సూచన**

ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద నుంచి 'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి: సొరంగంలో చిక్కుకున్న వారిని గుర్తించడానికి మట్టి పైభాగం నుంచి స్కాన్ చేయడం కన్నా.. సొరంగంలో కుడి, ఎడమ వైపులా చివరి వరకు పరికరాలు పంపి పరిశీలన చేస్తే మంచి ఫలితాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. మట్టి దిగువ భాగంలో ప్రాథమికంగా పలు చోట్ల ఉనికి గుర్తించినా తవ్వకాలు చేస్తే అక్కడ వేరే పదార్థాలు వెలుగుచూసినట్లు అధికారులు చెప్పగా సీఎం ఈ మేరకు సూచన చేశారు. ఆదివారం సాయంత్రం మంత్రులు ఉత్తమ్, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, బాలు నాయక్ తదితరులతో కలిసి సీఎం సొరంగాన్ని పరిశీలించిన అనంతరం అధికారులు, ఎన్డీఆర్ఎఫ్, ఎన్జీఆర్ఐ, సైన్యం తదితర సంస్థలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్వో సీనియర్ అధికారి కర్నల్ పరీక్షిత్ మెహ్రా, విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్ అర్వింద్‌కుమార్ సీఎంకు సొరంగంలో సహాయక చర్యలను వివరించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ప్రమాదంలో చిక్కుకున్న వారిని వీలైనంత త్వరగా బయటకు తీసుకురావాలి. ఈ విపత్తుపై సమగ్ర అధ్యయనం చేపట్టి ఒక డాక్యుమెంట్ రూపొందించాలి. అందరికీ ఇది ఉపయోగపడాలి. మిషన్‌ను ఏవిధంగా బయటకు తీసుకురావాలి. అది పనిచేస్తుందా? లేదా? అనేది చూడాలి. ఇది చాలా సంక్లిష్టమైన విపత్తు. శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించాలి' అని సూచించారు.

**ఐదు మీటర్ల వ్యాసంతో రెండు సొరంగాలతో పని సులువు..**

అధికారులు మాట్లాడుతూ.. అటవీ ప్రాంతం ఉండటంతో సమస్యగా మారిందని, సొరంగంలో 13.30 కిలోమీటరు వరకే వెంటిలేషన్ ఉందని తెలిపారు. భూమి పొరల్లో ఉన్న తేడాలతోనే సొరంగంలో బురద చొచ్చుకువచ్చిందని పేర్కొన్నారు. స్కానింగ్ కొంత క్లిష్టంగా మారిందని ఎన్జీఆర్ఐ అధికారులు తెలిపారు. నిర్మాణ సంస్థ ప్రతినిధి పంకజ్ మాట్లాడుతూ.. ఇప్పుడున్న 10 మీటర్ల వ్యాసంతో సొరంగం నిర్మాణంతో సమస్యలు ఉత్పన్నమైనందున రెండు వైపులా ఐదు మీటర్ల చొప్పున సొరంగాలు తవ్వాలని, కొంత దూరం వెళ్లాక తిరిగి వాటిని కలిపేలా నిర్మిస్తే షీర్‌జోన్ సమస్య నుంచి బయటపడే అవకాశాలు ఉండొచ్చని చెప్పారు. సీఎం స్పందిస్తూ టీబీఎం పనితీరుపై తనకు అవగాహన ఉందని ఆరేళ్ల క్రితం మన్నెవారిపల్లి వైపు లోనికి వెళ్లినట్లు తెలిపారు. సొరంగంలో ఎవరూ చిక్కుకోకుండా సహాయక చర్యలు చేపట్టాలని, మట్టి తొలగించే యంత్రాలను వాడాలని, ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

## రేవంత్ రెడ్డీ... నీకు చేతనైతే చంద్రబాబుపై యుద్ధం ప్రకటించు

:సీఎం రేవంత్ రెడ్డి నేడు ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలపరిశీలనకు వెళ్లడంపై బీఆర్ ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఘా టుగా స్పందించారు. మీ రాజకీయ ప్రయో జనాల కోసం సాంకేతికపరమైన అంశాలు నిర్లక్ష్యం చేసి ఆదరాబాదరాగా ఎస్ఎల్బీసీ పనుల ను పరుగెత్తించారని విమర్శించారు. కార్మికులు వద్దని వారిస్తున్నా వినకుండా వారిని మృత్యు కుహరంలోకి నెట్టారని మండిపడ్డారు. కార్మికుల ప్రాణాలు బలితీసుకుని ఇప్పుడు కుహనా ఏడ్పులు ఏడుస్తున్నారని ధ్వజమెత్తారు. నీకు నిజాయతీ ఉంటే ఎస్ఎల్బీసీ ప్రమాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులు ఎవరో తేల్చాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పచ్చి అబద్ధాలు మాట్లాడడం, నోటికి వచ్చినట్టు కారుకూతలు కూయడం ఇక ఆపేయాలని... ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే పనులు జరగవని, ఒళ్లు వంచి పనిచేస్తేనే పనులు జరుగుతాయని తెలిపారు. 15 నెలలైనా నీకు జ్ఞానోదయం కాకపోవడం తెలంగాణ దౌర్భాగ్యం అని హరీశ్ రావు పేర్కొన్నారు. "కేసీఆర్ హయాంలో ప్రాజెక్టుల పనులు ఆగలేదు కాబట్టే రేవంత్ రెడ్డి అప్పుడేమీ మాట్లాడలేకపోయాడు. నిధులు ఖర్చు చేయకుండానే 11.48 కిలోమీటర్ల మేర టన్నెల్ పనులు జరిగాయా? 2014 నుంచి 2023 వరకు రూ.3,900 కోట్లు ఖర్చు చేసి 11.48 కిలోమీటర్ల మేర టన్నెల్ తవ్విన విషయాన్ని ఎందుకు దాచిపెడుతున్నారు? కేసీఆర్ అంటే పచ్చని పంట పొలాలు... రేవంత్ రెడ్డి అంటే పచ్చి అబద్ధాలు అని ప్రజలకు కూడా అర్థమైంది. మేం పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రితో సత్సంబంధాలు కొనసాగించాం... అంతే తప్ప పక్క రాష్ట్ర సీఎం తరఫున సూట్ కేసులు మోయలేదు. ఏపీ సీఎం చంద్రబాబు రోజుకు 10 వేల క్యూసెక్కులు తరలించుకుపోతున్నాడు... ప్రశ్నిస్తున్న మాపై రంకెలు వేయడం కాదు... నీకు చేతనైతే చంద్రబాబుపై యుద్ధం ప్రకటించు. బీజేపీతో పగలు కుస్తీ... రాత్రి దోస్తీ. ఎస్ఎల్బీసీ టన్నెల్ సందర్శనకు వచ్చిన బీఆర్ఎస్ నేతలను ఎందుకు ఆపారు? బీజేపీ నేతలకు ఎలా స్వాగతం పలికారు?" అంటూ హరీశ్ రావు విమర్శనాస్త్రాలు సంధించారు.

## ఉగాది నుంచి గద్దర్ అవార్డులు

- మొదటి పేజి తరువాయి

ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సంగీత నాటక అకాడమీ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ..వాగ్గేయకారులకు, కళాకారులకు మా ప్రజా ప్రభుత్వం గౌరవం ఇస్తోందని తెలిపారు. సినీ ఇండస్ట్రీ వారితో పాటు వాగ్గేయకారులు, నాటకాలు వేసే వారికి కూడా అవార్డులు ఇస్తామని పేర్కొన్నారు. గానం అందరికీ వచ్చే కళ కాదని.. దానిని గౌరవంగా భావించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ద కాలంగా కళాకారులకు నంది అవార్డులు ఇవ్వలేదని.. మా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే సినిమా కళాకారులను ప్రోత్సహించాలని నిర్ణయించిందని తెలిపారు. ఇందులో భాగంగానే సినీ రంగంలో విశేష ప్రతిభ కనబర్చిన వారికి ఇచ్చే నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అలాగే.. నాటక పోటీలను నిర్వహించి కళాకారులకు అవార్డులు ఇవ్వనున్నామని తెలిపారు

## ఏపీ సర్కార్ కు షాక్: రుషికొండ బీచ్‌కి బ్లూఫ్లాగ్ ట్యాగ్ రద్దు.. ఇంతకీ బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ ఏంటీ..

- మొదటి పేజి తరువాయి

ఎడ్యుకేషన్ సంస్థ. ఇదిలా ఉండగా గత కొంతకాలంగా రుషికొండ బీచ్ లోకి శునకాలు రావడం, సీసీ కెమెరాలు పనిచేయకపోవడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్న క్రమంలో బ్లూ ఫ్లాగ్ ట్యాగ్ ను రద్దు చేసినట్లు తెలుస్తోంది.అంతే కాకుండా బీచ్ పరిసరాల్లో వ్యర్థాలు పేరుకుపోవడం.. బట్టలు మార్చుకునే గదుల దగ్గర శుభ్రత లోపించటం, నడక దారి ధ్వంసం అవ్వటం వంటి కారణాల వల్ల బ్లూ ఫ్లాగ్ ట్యాగ్ రద్దయినట్లు తెలుస్తోంది.

బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ అంటే ఏంటి:

బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ అంటే.. డెన్మార్క్ కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ సంస్థ ఇచ్చే అంతర్జాతీయ స్థాయి గుర్తింపు. బోట్ టూరిజంకి అనువుగా ఉండే, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన బీచ్ లకు ఈ సర్టిఫికెట్ ఇస్తారు.

**ప్రభుత్వం క్లారిటీ:**

రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ ట్యాగ్ ఉపసంహరణపై సీరియస్ అయ్యింది ఏపీ ప్రభుత్వం. తక్షణమే పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది ప్రభుత్వం.బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్‌ను రద్దు చేయలేదని.. తాత్కాలికంగా మాత్రమే ఉపసంహరించారని వివరణ ఇచ్చింది ప్రభుత్వం.సేఫ్టీ ప్రోటోకాల్స్ అప్‌డేట్ చేయాలని బ్లూఫ్లాగ్ ఫౌండేషన్ సూచించిందని.. రెండు రోజుల్లో ఆడిట్ తర్వాత పునరుద్ధరిస్తాంస్పష్టం చేసింది ప్రభుత్వం.

## బీఆర్ఎస్ నుంచి వచ్చిన 10 మంది ఎమ్మెల్యేలు తిరిగి వెళ్లిపోతరు

- మొదటి పేజి తరువాయి

చేతకావడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యలను డైవర్ట్ చేసేలా సీఎం రేవంత్ రెడ్డి సంబంధం లేని అంశాల గురించి మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. మంత్రులు తన మాట వినడం లేదని స్వయంగా సీఎం రేవంతే చెప్పారన్నారు. బీసీల గురించి మాట్లాడిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేశారని అన్నారు. మామునూర్ ఎయిర్ పోర్టుతో కాంగ్రెస్ కు సంబంధమే లేదని.. ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వ కృషితోనే వరంగల్ ఎయిర్ పోర్టు వచ్చిందని తెలిపారు.

సీఎం రేవంత్ కు అసలు పరిపాలన పట్టుందా..? సీఎం కుర్చీ కాపాడుకోవడానికి ఆయనకు ఢిల్లీ టూర్లే సరిపోతున్నాయని ఎద్దేవా చేశారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి.. సీఎం రేవంత్ రెడ్డికి అసలు పోలికే లేదని.. నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడిన వ్యక్తి కిషన్ రెడ్డి.. పదవుల కోసం తిట్టిన పార్టీలోనే చేరిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అని సెటైర్ వేశారు. ప్రమాదం జరిగిన 9 రోజుల తర్వాతనా సీఎం ఎస్ఎల్ బీసీ ప్రమాద ఘటన స్థలానికి వెళ్లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పదిహేను నెలలు అవుతోన్న ఇంతవరకు కేబినెట్ విస్తరణ ఎందుకు చేయలేదని నిలదీశారు. సీఎం రేవంత్ పాలన నీరో చక్రవర్తిలా ఉందని మండిపడ్డారు. వాటా ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు కేంద్ర ప్రభుత్వం ఇస్తోందన్నారు. త్రిభాష సిద్ధాంతం వద్దని రేవంత్ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## స్మగర్లు, దేశద్రోహులను సినిమాల్లో హీరోలుగా చూపిస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

రూపకల్పన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని, దీనివల్ల ఎలాంటి సందేశం వెళుతుందో దర్శకులు ఒకసారి ఆలోచించాలని అన్నారు.

చెడ్డ పనులను ఎప్పుడూ గొప్పగా చూపించకూడదని, దీని ప్రభావం పిల్లలపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సినిమా రంగం బాధ్యతాయుతమైన మాధ్యమంగా ఉండాలని వెంకయ్యనాయుడు అభిలషించారు. ఇటీవల కన్నుమూసిన తెలుగు చిత్ర పరిశ్రమ తొలి తరం నటి, నిర్మాత కృష్ణవేణి సంస్మరణ సభ నేడు హైదరాబాదులో ఫిలింనగర్ కల్చరల్ క్లబ్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా వెంకయ్యనాయుడు ఈ వ్యాఖ్యలు చేశారు.

# నేడు ప్రజావాణి రద్దు...

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 02,03 తేదీ సోమవారం జరగనున్న ప్రజావాణి రద్దు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ సోమవారం ఉన్నందున జిల్లా అధికార యంత్రాంగం అంతా కౌంటింగ్ ప్రక్రియలో నిమగ్ధమై ఉండటం వలన సోమవారం జరగనున్న ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున ప్రజలందరూ గమనించి దరఖాస్తులు ఇవ్వడానికి ఐ డి ఓ సి కార్యాలయానికి రావద్దని సూచించారు.

# కొత్తగూడెం ఏరియాలో దుద్ధిళ్ల శ్రీపాద రావు జయంతి వేడుకలు.




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),మార్చ్ 02, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయము నందు స్వర్గీయులు దుద్ధిళ్ల శ్రీ పాద రావు జయంతి వేడకను నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ ఉన్నత విలువల కు, నీతి నిజాయితీల కు ప్రతిరూపంగా మాజీ స్పీకర్ కీర్తిశేషులు దుద్ధిళ్ల శ్రీపాదరావు నిలుస్తారని, ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభకు స్పీకర్ గా వ్యవహరించి అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకుల తో మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తి అని కొనియాడారు. దుద్ధిళ్ల శ్రీపాద రావు ఇప్పుడు ఉన్న మంథని శాసనసభ్యులు ఐటీ శాఖ మంత్రి వర్యులు దుద్ధిళ్ల శ్రీధర్ బాబు తండ్రి గారని వీరు మార్చ్ 02,1935వ సంవత్సరంలో దువ్వాడ గ్రామం, కాటారం మండలం, జయశంకర్ జిల్లాలో జన్మించారని, రాజకీయాల్లో ఉన్నత విలువలకు పట్టం కట్టిన తెలంగాణ ప్రాంత నేతగా ఆయన ప్రజల మనసుల్లో చిరకాలం గుర్తుండి పోతారని, తన రాజకీయ జీవితం మొత్తం ప్రజలకు అంకితం చేసి, ప్రజా సేవకే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చారని, ప్రతిపక్షాలు కూడా ఆమోదించి ప్రశంసించిన స్పీకర్ గా చరిత్రలో నిలిచిపోయారని ఈ సందర్భంగా ఆదివారం జరిగిన దుద్ధిళ్ల శ్రీపాదరావు జన్మదినోత్సవ వేడుకల్లో ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిఎంతో పాటు కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వి మల్లికార్జున రావు, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, ఎస్ఓటు జిఎం జి.వి. కోటి రెడ్డి, ఏజిఎం (సివిల్) సిహెచ్. రామకృష్ణ, ఇంచార్జ్ క్వాలిటీ డిపార్ట్మెంట్ మదన్ మోహన్, ఎస్ఈ (ఐఈడి) కే.ఆర్. నాగభూషణం, సీనియర్ పిఓ ఎం. మురళీ, సింగరేణి సేవ సమితి కోఆర్డినేటర్ సిహెచ్.సాగర్, గోవింద్ సత్య నారాయణ మరియు జిఎం కార్యాలయం లోని ఇతర ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ జన్మదిన వేడుక లు.

పాల్గొన్న జిల్లా నాయకులు కందుల తానేష్ గౌడ్, సంఘం గ్రామం.

సికే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధిబాలరాజు మార్చి 2.

అభిమానుల శుభాకాంక్షలు వెల్లువ



యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఏకే ప్యాలస్ లో ఫ్లెక్సీలు కట్ అవుట్ లు కట్టి వారి అభిమానాన్ని చాటుకున్నారు ఆదివారం భారతీయ జనతా పార్టీ శ్రేణులు అభిమానులు మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ ను శాలువాతో సన్మానించి వారి సమక్షంలో కేక్ తినిపించి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు పార్టీ శ్రేణులు అభిమానులు వలిగొండ మండలం బిజెపి పార్టీ ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్చాలను అందజేశారు.

ఈ సందర్భంగా మాజీ ఎంపీ బూర మాట్లాడుతూ ప్రజలు తనపై చూపించిన అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు, తన పుట్టినరోజున అన్నదానం పండ్లు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు,ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షు లు ఊట్కూరు అశోక్, మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, బిజెపి పార్టీ పార్లమెంటు మెంబర్ బందారపు లింగస్వామి జిల్లా నాయకులు దంతూరి సత్తయ్య గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల తానేష్ గౌడ్,మండల నాయకులు కొత్త రామచంద్రు మైసొల్ల నరసింహ, బచ్చు శ్రీనివాస్, వివిధ మండలాల మండల అధ్యక్షులకు పార్టీ శ్రేణులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు,

# స్ఫూర్తి ప్రదాత స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాద రావు.

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్..




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),మార్చ్ 02, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో శాసనసభకు వన్నె తెచ్చిన మాజీ స్పీకర్, స్వర్గీయ నేత దుద్దిళ్ళ శ్రీపాదరావు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఆయన జయంతి సందర్భంగా ఆదివారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశం మందిరం లో ఏర్పాటు చేసిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ తో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్గీయ శ్రీపాద రావు న్యాయవాదిగా ప్రజలకు మంచి సేవలు అందించారని, ఆయన రాజకీయ ప్రస్థానం లో మొదటిగా సర్పంచ్ గా రెండు సార్లు ఎన్నికై తదుపరి మహాదేవపూర్ సమితి అధ్యక్షుడిగా ఎన్నికైయ్యారని చెప్పారు. 1984 ఎన్నికల్లో మొదటి సారి మంథని నుంచి శాసన సభ్యులుగా పోటీ చేసి విజయం సాధించి 3 సార్లు శాసన సభ్యునిగా ఎన్నికైనట్లు తెలిపారు. 1994 లో ఓటమి పాలు అయినప్పటికీ ప్రజల మధ్యనే ఉంటూ ఎన్నో సేవలు అందించడం అలాగే 1999 ఏప్రిల్ 13న మహదేవపూర్ మండలం అన్నారంకు తన అనుచర వర్గంతో వెళ్లి వస్తున్న క్రమంలో మార్గ మధ్యంలోని అడవుల్లో ఆయన వాహనాన్ని నక్సల్స్ ఆపివేసి, ఆయనతో మాట్లాడాలని చెప్పి లోపలికి తీసుకెళ్లి కరుకు తుపాకీ తూటాలతో విగత జీవున్ని చేశారు. ఆయన మరణించిన... ఇప్పటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు అని కలెక్టర్ అన్నారు. అధికారులు మహనీయుని గురించి కింది స్థాయి సిబ్బందికి కూడా తెలపాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి, డిఎం సివిల్ సప్లైస్ త్రినాధ్ బాబు , మైనింగ్ శాఖ అధికారి దినేష్ మరియు వివిధ శాఖల అధికారులు, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉమ్మడి రాష్ట్ర మాజీ శాసనసభాపతి దుద్దిళ్ళ శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం.

- శ్రీ విద్యాభ్యాస పాఠశాలలో శ్రీపాద రావు 88వ జయంతి వేడుకలు.
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏరియా ఐ ఎన్ టి యు సి నాయకులు వత్సవాయి కృష్ణంరాజు.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 02,ఉమ్మడి రాష్ట్ర మాజీ శాసనసభాపతి ప్రజా నాయకులు స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాద రావు సేవలు చిరస్మరణీయమని నేటి తరానికి ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐ ఎన్ టి యు సి)ఏరియా ఉపాధ్యక్షులు వత్సవాయి కృష్ణంరాజు అన్నారు. ఆదివారం మధ్యాహ్నం మణుగూరు మండలం సంతోష్ నగర్ లోని శ్రీ విద్యాభ్యాస పాఠశాలలో సింగరేణి ఆర్జీవన్ జిఎం డి లలిత్ కుమార్ ప్రముఖ జర్నలిస్ట్ అనిత దంపతుల సహకారంతో దివంగత నేత ఉమ్మడి రాష్ట్ర శాసనసభ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాద రావు 88వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పిల్లలకు సహపంక్తి భోజనాలు, బిస్కెట్లను అందజేశారు. కార్యక్రమానికి ముందు శ్రీపాద రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ రాజకీయాలలో ప్రారంభోత్సవాలు చేసిన నాయకుల పేర్లు శిలాఫలకాలపై లిఖించ బడతాయని కానీ ప్రజలలో మమేకమై ప్రజల అభివృద్ధే తమ అభివృద్ధిగా భావించి ప్రజలకు సేవ చేసిన నాయకులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు అనటానికి దుద్దిళ్ళ శ్రీపాదరావు గారు ఒక గీటురాయి అని తండ్రి శ్రీపాదరావు కాలం నుండి మంత్రి నేటి శ్రీధర్ బాబు వరకు మంథని శాసనసభ్యులుగా అధికారంలో ఏ రాజకీయ పార్టీ ఉన్న దుద్దిళ్ళ వారి కుటుంబ సభ్యులనే తమ నేతలుగా ప్రజలు ఎన్నుకుంటున్నారు అంటే ప్రజలలో శ్రీపాద రావు ఎంతటి ప్రభావం కలిగిన నేతనో మనకు అర్థం అవుతుందని నేటి రాజకీయ నాయకులకు ఆయన స్ఫూర్తిదాయకం కావాలని ఆయన ఆకాంక్షించారు, శ్రీపాద రావు సేవలు చిరస్మరణీయమని ఆయన ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు, మార్చి 2 శ్రీపాద రావు జయంతి వేడుకలు అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం సముచిత నిర్ణయంగా ఆయన అభివర్ణించారు, అనంతరం చిన్నారులకు సహ పంక్తి భోజనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు, పాఠశాలకు అన్ని విధాలుగా సహకరిస్తున్న లలిత్ కుమార్ అనిత మేడం దంపతులకు వారి మిత్ర బృందానికి విద్యార్థిని విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు, సింగరేణి సేవా సమితి సభ్యులు యస్ డి నా సర్ పాషా సమన్వయకర్తగా వ్యవహరించగా , ఐ ఎన్ టి యూస్ నాయకులు పసులూరి రామారావు, సేవా సమితి సభ్యులు ఏ మంగీలాల్,శ్రీ విద్యాభ్యాస పాఠశాల కరస్పాండెంట్ బి జగన్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు , స్వాతి, సిబ్బంది సుజాత,రాధ తదితరులు పాల్గొన్నారు.

# ఐటీడీఏ భద్రాచలం ప్రాజెక్టు ఆఫీసర్ ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి.

సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ డిమాండ్.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మార్చ్ 01,,భద్రాచలం మండల సుందరయ్య నగర్ కాలనీ యందు లిసేవాలాల్ సేన మండల అధ్యక్షులు బోడ వీరేందర్ నాయక్ ఆధ్వర్యంలో మండల స్థాయి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ పాల్గొన్నారు వారు ఈ సమావేశానికి ఉద్దేశించి మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏజెన్సీ చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు 1/70 యాక్టు, పీసా యాక్టు చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని అమలు చేయాల్సిన అధికారులే ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కుతూ గిరిజన ప్రజలకు అన్యాయం చేస్తా ఉన్నారని అన్నారు ఏజెన్సీ ప్రాంతాలలో టెండర్లను గిరిజన ప్రజలకే ఇవ్వాలన్న చట్టాలు ఉన్నప్పటికీ వాటికి ఉల్లంఘన చేస్తూ గిరిజనేతురులకు కేటాయిస్తా ఉన్నారని అన్నారు భద్రాచలం ఐటిడిఏ పరిధిలో ఉన్న టెండర్లను గిరిజనేతరులకు ఎక్కువ టెండర్లు కేటాయిస్తూ గిరిజన ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న అధికారుల పనితీరు గిరిజన ప్రజల ఆచారాలు సాంస్కృతి సంప్రదాయాల పట్ల ఎలాంటి అవగాహన లేదని కనీసం గిరిజన ప్రజల జీవన విధానాన్ని అర్థం చేసుకొని ఏజెన్సీ ప్రాంతాలలో గల చట్టాలకు లోబడి పని చేయాల్సిన ఉన్న అధికారులు అందుకు అనుగుణంగా పనిచేయకుండా కేవలం షెడ్యూల్ ప్రాంతాల్లో గల వనరులను అభివృద్ధి పేరిట అంటగడుతూ భద్రాద్రి జిల్లాలో ఉన్న గిరిజన ప్రజల జీవనానికి ఆటంకాలు కలిగిస్తున్నారని అన్నారు గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయకుండా ఎదేచ్చగా అక్రమ నిర్మాణాలు అక్రమంగా ఇసుక గ్రావెల్ మట్టి తోలకాలను ప్రోత్సహించడానికి మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని చట్టాలు అమలు చేయాలని కోరుతున్న గిరిజన నాయకులను బెదిరించడం భయభ్రాంతులకు గురి చేయడం ప్రజాస్వామ్యంలో సరైన పద్ధతి కాదని ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న అధికారులు కానీ ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన రక్షణ కొరకు ప్రత్యేకంగా పనిచేస్తున్న ఐటీడీఏ పిఓ మరియు జిల్లా కలెక్టర్ సైతం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని అన్నారు

1/70 యాక్ట్ , పీసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయకపోతే సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం ఐటిడిఏ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్ జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్ రమేష్ నాయక్ కిషన్ నాయక్ సీతారాం నాయక్ సురేష్ నాయక్ శేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# చర్ల లో కరకట్ట కడతారా, కట్టరా ప్రజలకు ప్రభుత్వం స్పష్టతను ఇవ్వాలి.

- కరకట్ట కడితే కోరేగడ్డ భూములకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి.
- కట్టని యెడల కోరేగడ్డభూములకు హక్కుపత్రాలు ఇవ్వాలి..
- బహుజన్ సమాజ్ పార్టీ భద్రాచలం అసెంబ్లీ నియోజక వర్గ అధ్యక్షులు కొండా చరణ్ డిమాండ్...




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,( సాయి కౌశిక్),మార్చ్ 01,చర్ల మండల కేంద్రంలోని బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో మండల ముఖ్య నాయకుల సమావేశం మండల అధ్యక్షులు కొండా కౌశిక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బహుజన సమాజ్ పార్టీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు కొండా చరణ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేపట్టిన సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం కారణంగా సాగు చేసుకునే వందలాది ఎకరాల భూములు సీతమ్మ సాగర్ ప్రాజెక్టులో మునిగిపోతున్నాయని గతంలోనే రైతులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు, రాస్తారోకోలు, స్థానిక అధికారులకు వినతి పత్రాలు, ఇచ్చి ఉన్నారని అన్నారు. ఒకప్పుడు కూలీలుగా దొరల దగ్గర కొనసాగిన వీరు నేడు రైతులుగా మారారంటే దానికి ప్రధాన కారణం కోరగడ్డ భూములేనని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన నష్టాన్ని ప్రస్తుతం కొనసుగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం చెయ్యెదని అన్నారు. ప్రస్తుతం అధికారంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, గత టిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని కొనసాగిస్తారా, లేక నిలుపుదల చేస్తారా, అనే అంశం పై ఈ ప్రాంత ప్రజలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.కరకట్ట పనులు కొనసాగని యెడల దశాబ్దాలుగా సాగులో ఉన్న కోరేగడ్డ భూములకు ఈ ప్రభుత్వం హక్కు పాత్రలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇట్టి విషయం పై రైతులకు స్పష్టత లేక పలు అనుమానాలతో భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వ మాదిరి కరకట్ట పనులు కొనసాగిస్తే ప్రతి రైతుకు తన కోల్పోతున్న భూమి నష్టపరిహారాన్ని చెల్లించాలని తద్వారా జీవన ఉపాధిని రైతులకు, కూలీలకు, కల్పించాలని ఆయన ప్రభుత్వాని కోరారు.కోరేగడ్డ భూమిపై ఆధార పడి జీవిస్తున్న ప్రజలకు అన్యాయం జరిగితే బీఎస్పీ పార్టీ చూస్తూ ఊరుకోబోధని బాధిత ప్రజానీకాన్ని మొత్తాన్ని ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలకు పునుకుంటామని అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, మరియూ చర్ల మండల పార్టీ ఇంచార్జ్ సామల ప్రవీణ్, మండల పార్టీ ఉపాధ్యక్షులు చెన్నం మోహన్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఏకుల వెంకటేశ్వర్లు,పున్నారావు, తదితరులు పాల్గొన్నారు.ల

# జిల్లా స్థాయి క్రికేట్ పోటీలు ప్రారంభోత్సవం



వేములపల్లి సీకే న్యూస్ మర్చి 2:వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ పార్వతీ రామలింగేశ్వర స్వామి జాతర మహోత్సవ సందర్భంగ ఆదివారం ఉమ్మడి నల్గొండ జిల్లాస్థాయి క్రికేట్ పోటీలు ఆలయ చైర్మన్
తాళ్ల వెంకటేశ్వర్లు ప్రారంభించారు
ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు,బహుమతుల దాతలు,మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# కంటైనర్ ముసుగులో మూగ జీవాలు తరలింపు.

- "రెండు కంటైనర్ లో అక్రమంగా తరలిస్తున్న మూగజీవుల వాహనాలు పట్టివేత."
- "65: పశువులు రాంపూర్ గోశాలకు తరలింపుగా అధికారుల ప్రకటన."
- "ఎస్ఐ తాజుద్దీన్ ఆయన తో ఏది.! అంత ఈజీ కాదు."



**"ములుగు జిల్లా సీకే న్యూస్ ప్రతినిధి భార్గవ్"**ములుగు జిల్లా ఏటూరు నాగారం మండల కేంద్రంలో అటవీ శాఖ కార్యాలయం చెక్ పోస్ట్ వద్ద ఆదివారం తెల్లవారు జామున ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ పి .ఐ పి ఎస్.ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఏటూరు నాగారం సిఐ అనుముల శ్రీనివాస్ సూచనల మేరకు ఎస్ఐ తాజుద్దీన్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది తో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా. చర్ల నుండి హైదరాబాద్ కు అక్రమంగా పశువులు తరలిస్తున్న కంటైనర్. 2 వాహనాలను ఆపి తనిఖీ చేయగా ఎలాంటి రహదారి . కొనుగోలు అనుమతులు లేకుండా మూగ జీవాలు . పశువులు ఒకదానిపై ఒకటి కిక్కిరిసి కట్టివేసి మూగజీవాలకు ఆహారం (.మేత) తాగునీటి సౌకర్యం ఏమీ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా 65 పశువులను చిత్రహింసలకు గురిచేస్తూ తరలిస్తుండడంతో పట్టుకున్నారు. లారీ డ్రైవర్. క్లీనర్. ఎండి ఈసా.మారపాక రాజు .ఎండి అజిత్ అలీ ఖాన్.జియాముద్దీన్. లకావత్ బాలరాజు. సాంబశివుడు. 6 ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా. ఏటూర్ నాగారంకు చెందిన ఎండి ఈసా చర్ల ప్రాంతం చుట్టుపక్కల గ్రామాల వద్ద పశువులను కొనుగోలు చేసి. వాహనాలలో హైదరాబాద్ తరలించి అమ్మకాలు జరుపుతూ లాభాలు అర్జిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు .పశువులను వెటర్నరీ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి రాంపూర్ గోశాలకు గోశాలకు తరలించడం జరిగింది. అన్నారు .

ఈ సందర్భంగా ఎస్సై తాజుద్దీన్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మూగజీవాలను తరలిస్తే ఊరుకునేది లేదని చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# నాగరిక వికాస్ కేంద్రం ప్రారంభించిన తుమ్మల



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం మార్చి 2 :** జమాఅతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో హ్యూమన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్మించిన నాగరిక వికాస్ కేంద్రం ను ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ , మార్కెటింగ్ , చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న .జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర సలహా మండలి సభ్యులు సాధిక్ అహ్మద్ మాట్లాడుతూ పేద ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతోపాటు ఈ కేంద్రం లో ఉచితంగా ఆన్లైన్ చేయడం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర మాట్లాడుతూ జమాఅతె ఇస్లామీ హింద్ ప్రారంభించిన నాగరికత వికాస కేంద్రం చాలా గొప్ప కార్య క్రమం , దీనివల్ల చాలామంది పేద ప్రజలకు , విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అంతేగాక జమాఅతె ఇస్లామీ హింద్ చేపట్టే అనేగా సంక్షేమ కార్యక్రమాలను తమ ప్రభుత్వం తరఫున ఎల్లప్పుడూ సహాయ , సహకారాలు ఉంటాయని తెలి పా రు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ముహమ్మద్ ఇల్యాస్, జిల్లా అధ్యక్షులు జైనుల్ పాషా, జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ సమి, ఖిల్లా, ఇంద్రనగర్, ఇస్లాంపేట అధ్యక్షులు అబ్దుల్ మలిక్, నిజాముద్దీన్, అబ్దుస్ సుబూర్, సభ్యులు ఖలీల్ అహ్మద్ ఖాన్,అబ్దుల్ ముజీబ్.అబ్దుల్ రాపె, షేక్ ఇలియాస్, అబ్దుల్ రజాక్, గౌస్, ఫయాజ్, షేక్ మలిక్ ,రఫీ, నాసర్, గఫ్ఫార్, యమ్. పి.జె జిల్లా అధ్యక్షులు షక్ ఖాసిం కార్యకర్తలు, తదతరులు పాల్గున్నారు.

# భూకబ్జా ఆరోపణలపై కాంగ్రెస్ నేత ముస్తఫా తీవ్ర ఆగ్రహం

- ఇంచు భూమి నీ ఆక్రమించినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసానికి సిద్ధమని సవాల్
- జిల్లా మంత్రులను బదనం చెసేందుకు తప్పడు ప్రచారం
- దొంగే దొంగ అన్నట్లు, మతి భ్రమించి మాట్లాడుతున్న బి ఆర్ ఎస్ నేతలు
- యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎండి ముస్తఫా





**సి కె న్యూస్ ప్రతినిధి ఖమ్మం**

ఖమ్మం: రమణ గుట్టలో భూకబ్జా ఆరోపణలపై కాంగ్రెస్ నేత ముస్తఫా తీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రమణ గుట్టలో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు 57 డివిజన్ కార్పొరేటర్ రఫీదా భర్త ముస్తఫా మాట్లాడుతూ బి ఆర్ ఎస్ నేతలకు సవాల్ చేశారు. కొద్దీ మంది అరాచక శక్తులు తమ పై పని కట్టుకోని దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నిరాధారణ ఆరోపణలు చేసే వారు మేము, ఇంచు భూమిని ఆక్రమించుకున్నట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసానికి సిద్ధమవుతామని సవాల్ విసిరారు.జిల్లా మంత్రులను బదనం చేసేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దొంగే దొంగ అన్నట్టు మతి భ్రమించి బిఆర్ఎస్ నేత చేస్తున్నా ప్రచారమే దీనికి నిదర్శనమని ఆయన అభివర్ణించారు. గత బి ఆర్ ఎస్ పాలనలో రమణగుట్టను తారా స్థాయిలో కబ్జాలు చేసి నిరుపేద ప్రజలను బెదరిస్తూ,భయభ్రాంతులకు గురిచేసి ,కబ్జా లు అక్రమాలకు తెరలేపి కటకటాల పాలైన సంగతి నగర ప్రజలకు తెలుసు అన్నారు.కాంగ్రెస్ పై తమపై తప్పడు ప్రచారం చేస్తూ అభియోగాలు మోపితే రానున్న రోజులలో ప్రజలు తగిన బుద్ధి చెపుతారని హితవు పలికారు

# ఎం.ఆర్. డబ్ల్యు.ఎ 5.కె. రన్ కార్యక్రమంలో పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ




**శేరిలింగంపల్లి సీకే న్యూస్ ప్రతినిధి** మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృ శ్రీ నగర్ కాలనీ లో మాతృ నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రెసిడెంట్ అనిల్ కుమార్ కావూరి, సెక్రటరీ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎం ఆర్ డబ్ల్యు ఏ 4వ ఎడిషన్ 5 కె రన్ కార్యక్రమంలో మాజీ భారత అంతర్జాతీయ క్రికెటర్ మరియు మాజీ బి సి సి ఐ చీఫ్ సెలెక్టర్ ఎం ఎస్ కె ప్రసాద్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించి, విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.

ఈ సందర్భంగా మాట్లాడుతూ మాతృ శ్రీ నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ వారి ఆధ్వర్యంలో 5కె రన్ నిర్వహించడం చాలా అభినందనియం అని , నేటి ఉరుకుల పరుగుల జీవితంలో శారీరక శ్రమ ఎంతో అవసరం అని గుర్తు చేయడం ఈ రన్ ఎంతగానో తోడ్పడుతుంది అని ఎంతో మందికి స్ఫూర్తి గా నిలుస్తుంది అని , వృద్ధులు ,యువత , చిన్న పిల్లలు పాల్గొనడం ఎంతో ఆనందయాకం అని , ప్రతి ఒక్కరు ఆరోగ్యము పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శారీరక శ్రమ వలన మానసిక ఉల్లాసం ,ప్రశాంతత చేకూరుతుంది అని, మారిన జీవన శైలి లో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వ్యాయమం చేయాలని, ఈ రన్ ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది అని ,ఇది ఒక మంచి శుభపరిణామం అని పి ఎ సి చైర్మన్ గాంధీ తెలియచేశారు.

5%ఎ% రన్ కార్యక్రమంలో 1500 మంది వరకు ఉత్సహంగా పాల్గొన్నారు. బ్రేక్ ఫాస్ట్ స్పాన్సర్ ఇగ్నైట్ జూనియర్ కాలేజ్ రమేష్, టైటిల్ స్పాన్సర్ జెకె ఇన్ఫ్రా పట్టాభి ,మరియు కో స్పాన్సర్లు మయురా ఆయుర్వేద, బచ్పాన్ ప్లే స్కూలు, బి ఎం ఎస్ వెల్నెస్ సెంటర్, పల్స్ హార్ట్ హాస్పిటల్, యూరో కిడ్స్ ప్లే స్కూల్ స్పాన్సర్ గా వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో మాతృ శ్రీ నగర్ కాలనీ వాసులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడు కు జన్మదిన శుభాకాంక్షలు .

జన్మదిన వేడుక లో పాల్గొన్న వలిగొండ మండలం ప్రెస్ రిపోర్టర్లు.



**సికే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మార్చి 2.**

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఏకే ప్యాలస్ లో వలిగొండ మండలం ప్రెస్ రిపోర్టర్లు గోలనుకొండ బాలరాజు తెలంగాణ పత్రికా రిపోర్టర్, పాలోజు రాజు విజన్ ఆంధ్ర రిపోర్టర్, పోలేపాక బిక్షపతి 24 న్యూస్ రిపోర్టర్ పాల్గొని ,మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ ను శాలువాతో సన్మానించి వారి సమక్షంలో కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్చాలను అందజేశారు.

ఈ సందర్భంగా మాజీ ఎంపీ బూర మాట్లాడుతూ ప్రజలు తనపై చూపించిన అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు, తన పుట్టినరోజున అన్నదానం పండ్లు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మాజీ ఎంపీటీసీ రుద్రాక్ష బ్రహ్మంను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయల రాము..



**తల్లాడ మర్చి 2 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్ తల్లాడ:** మండలంలోని బిల్లుపాడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రుద్రాక్ష బ్రాహ్మం ఇటీవలే గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకున్న విషయం తెలుసుకున్న తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయల రాము ఆదివారం బిల్లుపాడు లోని రుద్రాక్ష బ్రహ్మం ఇంటి వద్దకు వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు అయినాల నరసింహారావు, రుద్రాక్ష విజయకుమార్, రుద్రాక్ష లక్షణాచారి పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఖమ్మం జిల్లా యువజన నాయకులు అడపా అనిల్ చౌదరి



**తల్లాడ మర్చి 2 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్ :** ఖమ్మం బి టి ఎస్ ట్రైన్ ఫ్యామిలీ రెస్టారెంట్ ఓపెనింగ్ కి విచ్చేసిన ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించి సత్తుపల్లి నియోజకవర్గం లోని యువతకు పలు సమస్యలపై వెంకట్ తో చర్చించారు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ త్వరలోనే పనులు నెరవేరుస్తానని హామీ ఇచారు ..

# మార్చి 8 న అంతర్జాతీయ మహిళా దినోత్సవం - 2025.


- అంతర్జాతీయ మహిళా దిన వారోత్సవాలు.
- జిల్లా ఎస్పీ ఆదేశాలతో 2 వ రోజు కొనసాగుతున్న అవగాహన కార్యక్రమాలు
- మహిళలు, చిన్నారుల రక్షణ, వారి భద్రతే మా ప్రధాన ధ్యేయం...
- కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ .



**ఎమ్మిగనూరు మార్చి 02, సీ కే న్యూస్** మార్చి 8 వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దిన వారోత్సవాలలో భాగంగా జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో మహిళల భద్రత కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా మెడికల్ క్యాంపు, ఓపెన్ హౌస్ ను సందర్శించిన మహిళలు, విద్యార్థినిలకు పోలీస్ అధికారులు పోలీస్ స్టేషన్ లో జరుగు విధులు, మహిళా సహాయ కేంద్రం పట్ల అవగాహన, పోలీసులు పనితీరు, వాడే పరికరాలు, పలు రికార్డుల నిర్వహణ తదితర విషయాలపై వివరించారు. మహిళ ల భద్రత ,హక్కులు సాధికారతపై అవగాహన కార్ర్యమాలు చేపట్టారు. మహిళా చట్టాలు, ఫోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ సామాజిక మాధ్యమాలు మరియు సైబర్ క్రైమ్స్ పై తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.బాలికలు తప్పనిసరిగా స్వీయ రక్షణ కలిగి ఉండాలని, ఎదుటివారి నుండి తమను తాము రక్షించుకోవడం నేర్చుకోవాలని తెలిపారు.

స్వీయ రక్షణ నైపుణ్యాలు, దృఢంగా మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండాలని, అదేవిధంగా సైబర్ భద్రత నియమాలు గురించి ప్రస్తుతం మనం టెక్నాలజీ యుగంలో ఉన్నామని,స్మార్ట్ మొబైల్స్ ఎక్కువగా వాడవద్దని, మొబైల్ ఫోన్స్ ఎక్కువగా వాడటం వలన సైబర్ క్రైమ్ లాంటి నేరాలు, జరగడానికి అవకాశం ఉందని, అనాథరైస్డ్ యాప్స్ మరియు మొబైల్స్ లో వచ్చే లింకులు సెలెక్ట్ చేయవద్దని తెలిపారు.జిల్లాలోని అనేక ప్రాంతాల నుండి వచ్చిన బాలికలందరూ మంచిగా చదువుకొని సమాజానికి, దేశానికి, రాష్ట్రానికి ఉపయోగపడాలని తెలిపారు.పోలీస్ శాఖ మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఎల్లవేళలా పోలీస్ సిబ్బంది సహాయం,సహకారాలు ఉంటాయని పోలీస్ అధికారులు తెలియజేశారు. మహిళలు/చిన్నారులకు అత్యవసర సమయంలో సహాయం కొరకు హెల్ప్‌లైన్ నెంబర్లు చైల్డ్ హెల్ప్ లైన్:1098, ఉమెన్ హెల్ప్ లైన్:181,పోలీస్ హెల్ప్ లైన్:100 / 112, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్:1930 , పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నంబర్ 7777877722 కు నెంబర్లకు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని తెలియజేశారు.

## వివాహవేడుకలకు హాజరైన....
## ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి.



**సీ కే న్యూస్ ఎమ్మిగనూరు మార్చి 02,**ఎమ్మిగనూరు మండల పరిధిలోని కలుగొట్ల మాజీ సర్పంచ్ బి.రామలింగడు కుమారుడి వివాహానికి ముఖ్య అతిథులు గా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి,శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.అనంతరం గోనెగండ్ల మండల పరిధిలోని పెద్ద మర్రివీడు గ్రామ తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ నాయకులు ఈడిగ చంద్రన్న గౌడ్ కుమారుడి వివాహానికి ముఖ్య అతిథులు గా ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమం లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మంచినీటి ఇబ్బంది రాకూడదు



**సీ కే న్యూస్ వెలిగండ్ల మార్చి 02:**వెలిగండ్ల మండల సర్వసభ్య సమావేశం ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రామన, మహాలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జడ్పీటీసీ గుంటక. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. రామన్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో ప్రజలకు మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్ బాషా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం...



**యాచారం మార్చి 2 సీ కే న్యూస్** రంగారెడ్డి జిల్లా యాచారం మండలం గునుగల్ గ్రామ క్రాస్ రోడ్ సమీపంలో ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్ లో జెడ్ పి హెచ్ ఎస్ రంగాపూర్ కు చెందిన 2021 - 2002 బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యను బోధించిన గురువు లాను ఘనంగా స్వాగతించి సన్మానం చేశారు. పాల్గొన్న గురువులు ఆజామ్ ఖాన్, ప్రేమాకర్ రెడ్డి, అక్బర్, గోవర్ధన్, సునీల్ కుమార్, శైలజ, విల్సన్, దశరథ, దిలీప్ రెడ్డి, గురువారెడ్డి, యాదగిరి చారి, పూర్వ విద్యార్థులు డి శ్రీనివాస్, చంద్రశేఖర్ సుజాత, ఎం జ్యోతి, విమల, ప్రశాంతి పూరా విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పనకు కృషి...

కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి..

**ఎల్బీనగర్, మార్చ్ 02, సీ కే న్యూస్** హయత్ నగర్ డివిజన్లోని మహేశ్వరి కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు ఆదివారం స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాలనీవాసులు ఏర్పాటు చేసిన



సమావేశంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారు కాలనీలో ఉన్న సమస్యలు, చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలను కాలనీవాసులు అడిగి తెలుసుకోవడం జరిగింది, కాలనీ వాసులు తమ కాలనీలో పూర్తిస్థాయిలో భూగర్భ డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ దుర్వాసనతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారని తెలపడంతో, కార్పొరేటర్ స్పందించి సంబంధిత అధికారులకు మహేశ్వరి కాలనీ వాసుల సమస్యలను వివరించి వీలైనంత త్వరగా భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్స్ సదుపాయం ఏర్పాటు చేసే కృషి చేస్తానని కాలనీ వాసులకి హామీ వారు ఇవ్వడం జరిగింది. ఈ సమావేశంలో కాలనీ అధ్యక్షులు పాండవ్ రెడ్డి, సంక్షేమ సంఘం సభ్యులు సుధాకర్ రెడ్డి, నరసింహ, నరేంద్ర రాజు, కుమార స్వామి, శ్రీనివాస్ రెడ్డి, శ్రవణ్, రవి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్ సంఖ్య ఘనం- కేటాయింపులు శూన్యం.



ఎస్టీలకు చాలా తక్కువ బడ్జెట్ కేటాయించారు... హర్ష వ్యక్తంపై నాయకుల పరిపక్వత్వానికి నిదర్శనం.

**సీ కే న్యూస్ చిలకలూరిపేట ఇంచార్జ్ మార్చి 3 పల్నాడు జిల్లా:**కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్ సంఖ్య ఘనం - కేటాయింపులు శూన్యంగా ఉందని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్ అన్నారు. పట్టణంలోని ఎన్నార్టీ సెంటర్లోని గల సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ బడ్జెట్ అంతా అంకెల గారడిల అభూత కల్పనలు తప్పా మరొకటి లేదన్నారు. ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా, ఎన్నికల వాగ్దానాలను పూర్తిగా విస్మరించారన్నారు. సూపర్ సిక్స్ పథకాలకు పంగనామాలు పెట్టారని ఆరోపించారు.

అన్నదాత సుఖీభవ పథకానికి కేవలం రూ.6,300 కోట్లు కేటాయించారని రాష్ట్రంలో 54 లక్షల మంది రైతులు ఎదురు చూస్తుంటే రూ.11 వేల కోట్లు నిధులు కావాలన్నారు. అయితే కూటమి ప్రభుత్వం కేంద్రం ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్ కోసం రైతులను నిరీక్షణకు గురి చేయడం అన్యాయమన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతుంటే రూ.300 కోట్లు ధరల స్థిరీకరణ నిధికి ఇవ్వడం దారుణమన్నారు. అన్ని సామాజిక వర్గాలకు కోట్ల రూపాయల కేటాయించి ఎస్టీలకు రూ.8,159 కోట్లు కేటాయించారన్నారు. దీనికి కొంతమంది ఎస్టి నాయకులు హర్షణియం అని చెప్పడం బాధాకరమన్నారు.

తల్లికి వందనం పథకానికి రాష్ట్రంలో 84 లక్షల మంది విద్యార్థులకు కావాల్సింది రూ.12,600 కోట్లయితే రూ. 9,407 కోట్లు మాత్రమే కేటాయించడం వెనుక కూటమి ప్రభుత్వ కుట్ర అర్థమవుతోందని తెలిపారు. దీపం 2.0 పథకానికి ఏడాదికి రూ.4500 కోట్లు అవసరమైతే రూ.2601 కోట్లు ఇవ్వడం వెనుక కోటిన్నర మంది లబ్ధిదారులు ఉండగా సగం మేర కోత పెట్టదలుచుకున్నారాని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదని, రూ.3 లక్షల కోట్ల బడ్జెట్ లో నెలకు రూ.350 కోట్లు కేటాయించే పథకానికి నిధులు ఇవ్వడానికి కూటమి ప్రభుత్వానికి మనసు రాలేదన్నారు. నెలకు రూ.1500 ఇచ్చే మహాశక్తి పథకాన్ని మాయం చేశారన్5. ఇది కోటిన్నర మంది మహిళలను అన్యాయం చేయడమేనని విమర్శించారు. రూ.10 లక్షల వరకు ఉచిత రుణాలు అని చెప్పి ఒక్క రూపాయి కేటాయించకుండా డ్వాక్రా మహిళలను మోసం చేయడం, నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని చెప్పి బడ్జెట్ లో ఒక్క రూపాయి కేటాయించకుండా 50 లక్షల మంది నిరుద్యోగులను మోసం చేయడం కాదా అన్నారు.

రాష్ట్ర రాజధానికి ఒక్క రూపాయి కేటాయించకుండా అప్పులతోనే అమరావతి కట్టాలని చూస్తున్న కూటమి ప్రభుత్వం తీరు ప్రజలను దగా చేసేలా ఉందన్నారు.

## గూడూరు మండలం లో కార్యక్రమాల్లో పాల్గొన్న గూడూరు మండల మాజీ ఎంపీపీ సర్పంచ్ నూనావత్ రమేష్ నాయక్





**న్యూస్ ఇండియా రిపోర్టర్ గొర్రె భరత్ గూడూరు :** గూడూరు మండల కేంద్రంలో పాపాని శ్రీనివాస్ అనిత నూతనంగా సూరత్ క్లాస్ సెంటర్ ను ప్రారంభించిన గూడూరు మండలం మాజీ ఎంపీపీ సర్పంచ్ నూనావత్ రమేష్ నాయక్ వారితోపాటు మాజీ వార్డ్ సభ్యులు హెచ్చు శివ మెరుగు మధు తదితరులు పాల్గొన్నారు

గూడూరు మండలం బొల్లెపల్లి గ్రామానికి చెందిన మాలోత్ కిషన్ సునీత గార్ల కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన గూడూరు మండల మాజీ ఎంపీపీ సర్పంచ్ నూనావత్ రమేష్ నాయక్ వారితోపాటు బొల్లేపల్లి మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధి పనులు పరిశీలన.
# 38వ వార్డు కౌన్సిలర్ జంగా సుజాత

**సీ కే న్యూస్ చిలకలూరిపేట ఇంచార్జ్ మార్చి 3 పల్నాడు జిల్లా** చిలకలూరిపేట:పట్టణములోని 38వ వార్డు ఆరిపుల్లా నగర్లో మాజీ మంత్రి,శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాలతో అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని నియోజకవర్గంలో ప్రజలు ఎక్కడ ఇబ్బంది పడకుండా ఉండేవిధంగా కృషి చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా ఆరిపుల్లా నగర్ లో సిమెంట్ రోడ్డు, కల్వర్టు, మురుగు కాలువల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ పనులను వార్డు కౌన్సిలర్ జంగా సుజాత ఆదివారం పరిశీలించారు. ఈ మేరకు ఆమె మున్సిపల్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# రోజాకు రుణం తీరినట్లేనా...వైసీపీకి కొత్త గాలి !

మాజీ మంత్రి వైసీపీ ఫైర్ బ్రాండ్ అయిన ఆర్కే రోజాకు నగరి నియోజకవర్గంతో రుణం తీరినట్లేనా అన్న చర్చ జోరుగా సొంత పార్టీలోనే సాగుతోంది. ఆమెకు వైసీపీలో మూడు సార్లు ఇక్కడ టికెట్ ఇస్తే రెండు సార్లు గెలిచారు. అది కూడా తక్కువ మెజారిటీతోనే ఆమె గట్టెక్కారు. అయినా సరే జగన్ ఆమె కోరిక అయిన మంత్రి పదవిని ఇచ్చి తీర్చారు.వైసీపీలో రోజా చేసిన సేవలకు గానూ పార్టీ కూడా తగిన విధంగానే న్యాయం చేసింది అని అంటున్నారు. ఈ క్రమంలో 2024 ఎన్నికల్లో రోజాకు టికెట్ దక్కదని అంతా అనుకున్నారు. మొత్తానికి మొత్తం నియోజకవర్గం వైసీపీ క్యాడర్ ఆమెకు దూరం అయిపోయింది. పార్టీలో మెజారిటీ నేతలు అంతా ఆమెకు టికెట్ వద్దు అన్నారు. అయినా జగన్ ఇచ్చారు. దాంతో ప్రత్యర్ధి పార్టీ అయిన టీడీపీకి అక్కడ 50 వేల పై చిలుకు మెజారిటీ వచ్చింది.ఈ క్రమంలో వైసీపీ ఎత్తిగిల్లాలంటే ఏమి చేయాలన్నది జగన్ ఆలోచన చేస్తున్నారు అని అంటున్నారు. పార్టీ నియోజకవర్గం ఇంచార్జిని మార్చాల్సిందే అన్న డిమాండ్ మీద వైసీపీ అధినాయకత్వం ఇపుడు సీరియస్ గానే ఫోకస్ పెట్టింది అని అంటున్నారు. దాంతో మాజీ మంత్రి దివంగత టీడీపీ నేత అయిన గాలి ముద్దు క్రిష్ణమనాయుడు కుటుంబం నుంచి రెండవ కుమారుడు గాలి జగదీష్ తన సొంత అన్న గాలి భాను ప్రకాష్ తో విభేదాలు కొనసాగిస్తున్నారు. గాలి భాను ప్రకాష్ ఎమ్మెల్యే అయినా తమ్ముడు మాత్రం తన రాజకీయం వేరు అని చెప్పేస్తున్నారు.ఆయన వచ్చే ఎన్నికల్లో నగరి నుంచి పోటీ చేయాలని చూస్తున్నారు. దాంతో ఆయనను వైసీపీలోకి రప్పించి ఫ్యాన్ ని అక్కడ గుర్రున తిప్పాలని వైసీపీ చూస్తోంది అని అంటున్నారు. గాలి ముద్దు క్రిష్ణమనాయుడు పలుకుబడితో జగదీష్ సొంత కష్టం వైసీపీ బలం అన్నీ కలిస్తే 2029 ఎన్నికల్లో వైసీపీ జెండా అక్కడా ఎగరేయాలని ఆ పార్టీ చూస్తోంది.



దీంతో గాలి జగదీష్ వైసీపీ తీర్థం పుచ్చుకోవడం ఖాయమని అంటున్నారు. నిజానికి చూస్తే గాలి జగదీష్ చేరిక వైసీపీలో ఎపుడో జరగాల్సి ఉందని అంటున్నారు. అయితే ఈ విషయం మీద వైసీపీ మాజీ మంత్రి రోజా అధినాయకత్వంతో నేరుగా మాట్లాడి అభ్యంతరం వ్యక్తం చేశారు అని అంటున్నారు.
అయితే ఆమెకు వేరే ఆల్టర్నేటివ్ పోస్టు ఇస్తామని ఆమె సేవలని కూడా పార్టీ ఉపయోగించుకుంటుందని నచ్చ చెప్పారని అంటున్నారు. అయినా సరే నగరి నియోజకవర్గం తనకు కాకుండా వేరే వారికి చాన్స్ ఇస్తే రోజా ఎలా రియాక్టు అవుతారో చూడాల్సి ఉంది.అయితే
ఎవరు అభ్యంతరం పెట్టినా వైసీపీ అధినాయకత్వం ఇప్పటికే డెసిషన్ తీసుకుందని అంటున్నారు. ఈ మొత్తం పరిణామాల క్రమంలో రేపో ఎల్లుండో గాలి జగదీష్ వైసీపీ కండువా కప్పుకోవడం ఖాయమని అంటున్నారు. మొత్తానికి చూస్తే నగరి నియోజకవర్గంలో కొత్త గాలి వీచడం ఖాయమని అంటున్నారు. దాంతో రోజాకు ఈ నియోజకవర్గంతో రుణం తీరినట్లే అని అంటున్నారు.

# ఎట్టకేలకు నెగ్గిన సర్కారు పంతం.. సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్ పై వేటు



సీఐడీ మాజీ డీజీ, సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ కుమారుపై ప్రభుత్వం వేటు వేసింది. ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ పర్యటనకు వెళ్లారనే ఆరోపణలపై విచారణ జరిపిన ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. సునీల్ కుమార్ పై వచ్చిన ఆరోపణలపై సీనియర్ ఐఏఎస్ అధికారి ఆర్పీ సిసోడియాతో ప్రభుత్వం విచారణ జరిపింది. ఆ విచారణలో సునీల్ కుమారుపై వచ్చిన అభియోగాలు నిజమని తేలడంతో సస్పెండ్ చేశారు.డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో సునీల్ కుమార్ పై అనేక ఆరోపణలు ఉన్నాయి. అప్పటి ప్రభుత్వ పెద్దల కళ్లల్లో ఆనందం చూడటానికి అంటూ రఘురామరాజును అరెస్టు చేసి కస్టడీలో వేధించారని ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై గుంటూరు నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రకాశం ఎస్పీ ఈ కేసును ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు సునీల్ కుమార్ ఐపీఎస్ సర్వీస్ రూల్స్ ను పాటించలేదనే ఆరోపణలతో ప్రభుత్వం సస్పెండ్ చేసింది. 2019 నుంచి 2024 వరకు ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లడం, ట్రావెల్ ప్లాన్ కు విరుద్ధంగా విదేశాల్లో ఉండటంపై సునీల్ కుమార్ పై ఆరోపణలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. దీనిపై విచారించిన కమిటీ నివేదిక ప్రకారం సస్పెండ్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.తాను చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినా, సునీల్ కుమారును సస్పెండ్ చేయలేదని రఘురామ ఎప్పటికప్పుడు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తనపై అక్రమంగా కేసు నమోదు చేయడమే కాకుండా కస్టడీలో చట్ట వ్యతిరేకంగా తనపై దాడి చేశారని రఘురామ ఆరోపిస్తున్నారు. ఈ కేసులో విచారణకు రమ్మంటూ సునీల్ కుమారుకు కనీసం నోటీసు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేసేవారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం సునీల్ ను వేరే అభియోగాలు మోపి సస్పెండ్ చేయడం గమనార్హం.

# బాబు దగ్గరకే దగ్గుబాటి...అందుకోసమేనా ?

రాజకీయాల్లో ఎవరేమిటి అన్నది కాలం నిర్ణయిస్తుంది. కానీ ఎవరు ఎలా ఎదగాలి అన్నది వారి రాజకీయ వ్యూహాలను బట్టే ఉంటుంది. తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ పెట్టినపుడు పెద్దల్లుడు దగ్గుబాటి ఆయన వెంటే ఉన్నారు. పార్టీ ఊహల్లో నుంచి ఉన్న నాయకుడు ఆయన. మామ గారికి చేదోడు వాదోడుగా ఉంటూ టీడీపీ 1983లో అధికారంలోకి రావడానికి తన వంతు చేయూతను ఇచ్చిన వారుగా దగ్గుబాటిని చెప్పుకోవాలి.ఆ సమయంలో చంద్రబాబు ఎక్కడ ఉన్నారు అంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా. ఆయన రాజకీయంగా అప్పటికి చాలా అవగాహన ఉన్న వారుగా కనిపిస్తారు. అయితే సొంత మామ పార్టీ పెట్టినపుడు మాత్రం కాంగ్రెస్ ని వీడి రాలేదు. పైగా 1983లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధిగా హస్తం గుర్తు మీద పోటీ చేసి టీడీపీ అభ్యర్ధి చేతిలో చంద్రగిరిలో ఓటమి పాలు అయ్యారు.కట్ చేస్తే ఓటమి తరువాత బాబు టీడీపీలోకి వచ్చారు. అలా మామ దగ్గర మంచి ప్రాపకమే సంపాదించారు. టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ సీఎం గా 1983 నుంచి 1989 దాకా పనిచేసిన కాలంలో పార్టీలో దగ్గుబాటి చంద్రబాబు అని రెండు వర్గాలుగా ఉండేవి. అలా బాబుతో సరిసమానంగా దగ్గుబాటి రాజకీయ హవా చలాయించారు.ఇద్దరు మధ్య గ్యాప్ కూడా చాలా ఉండేదని ప్రచారం సాగింది. అయితే 1995 ఎపిసోడ్ లో మాత్రం ఇద్దరు కలసిపోయారు. ఎన్టీఆర్ ని గద్దె దించే సమయంలో బాబు వైపు వచ్చిన దగ్గుబాటి ఉప ముఖ్యమంత్రిని ఆశించారు. కానీ అది జరగలేదు దాంతో చాలా కొద్ది సమయంలోనే తిరిగి ఎన్టీఆర్ వైపు దగ్గుబాటి వచ్చారు. ఎన్టీఆర్ మరణం తరువాత ఆయన బీజేపీ కాంగ్రెస్ లలో చేరారు. ఇక 2019లో ఆయన



వైసీపీలో చేరి పర్చూరు నుంచి పోటీ చేసి ఓటమి పాలు అయ్యారు.ఆ మీదట రాజకీయాలను వదిలేశారు. ఈ మొత్తం ఎపిసోడ్ లో చంద్రబాబు టీడీపీకి ముప్పయ్యేళ్ళ అధ్యక్షుడిగా కొనసాగడమే కాకుండా నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయ్యారు అలా బాబు తనదైన రాజకీయ వ్యూహంతో ముందుకు సాగితే దగ్గుబాటి మాత్రం రాజకీయంగా ఇబ్బంది పడి చివరికి రాజకీయాలే వద్దు అనుకున్నారు.ఇవన్నీ పక్కన పెడితే చంద్రబాబుతో దగ్గుబాటి పాత వైరాలను మరచి చెలిమి చేయడం ప్రారంభించారు. ముందుగా కుటుంబ కార్యక్రమాల లో కలుసుకుని మనసు విప్పి మాట్లాడుకున్న ఈ ఇద్దరూ ఇపుడు మరింత సన్నిహితం అయ్యారు. దగ్గుబాటి బాబు ఇద్దరూ ఇలా కలవడానికి కారణం ఏంటి అంటే దగ్గుబాటి కుమారుడు హితైష్ రాజకీయం కోసమే అని అంటున్నారు.దగ్గుబాటి కుటుంబంలో వారసుడిగా ఆయనను చూడాలని అనుకుంటున్నారు. పురంధేశ్వరి బీజేపీలో ఉన్నారు. కానీ ఆమె ఈ టెర్మ్ తరువాత రాజకీయాల నుంచి తప్పుకుంటారు అన్న చర్చ సాగుతోంది. దాంతో కుమారుడి ఉజ్వల రాజకీయ భవిష్యత్తు కోసం వాళ్ళ తాత పెట్టిన పార్టీలో చేర్పించి ఆయనను కూడా ఎమ్మెల్యేగా మంత్రిగా చూడాలని ఉందని అంటున్నారు. దాంతోనే
దగ్గుబాటి బాబుకు దగ్గర అయ్యారని అంటున్నారు. తెలుగుదేశంలో ఇపుడు యువతరం ప్రతినిధిగా నారా లోకేష్ ఉన్నారు. ఆయనతో పాటుగా హితైష్ కి కూడా చోటిస్తే ఏపీలో టీడీపీకి మరింత పట్టు దక్కుతుందని అంటున్నారు. చంద్రబాబు కూడా దగ్గుబాటి మీద సదభిప్రాయంతోనే ఉన్నారు. దాంతో 2029 నాటికి టీడీపీ టికెట్ ని హితైష్ కి ఇస్తారా ఆయన పోటీ చేస్తారా అన్నదే చర్చగా ఉంది. మొత్తానికి నారా నందమూరి కుటుంబాలతో పాటు దగ్గుబాటి కుటుంబం కూడా కలిసికట్టుగా ముందుకు సాగితే ఆ రాజకీయాలే వేరు అని అంటున్నారు.

## సూట్ కేస్ లో మహిళ మృతదేహం... ఎవరీ కాంగ్రెస్ కార్యకర్త?

హర్యానాలో ఓ షాకింగ్ విషయం తెరపైకి వచ్చింది. రోహ్తక్ జిల్లాలోని సంప్లా సిటీలో మార్చి 1 ఉదయం బస్టాండ్ దగ్గర ఓ సూట్ కేసు అనుమాస్పదంగా పడి ఉంది. దీంతో... అటుగా వెళ్తున్న వ్యక్తులు దాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో.. అక్కడకు చేరుకున్న పోలీసులు సూట్ కేస్ తెరిచి చూడగా.. షాకింగ్ విషయం బయటపడింది.
అవును... హర్యానాలోని సంప్లా పట్టణంలో గల బస్టాండ్ దగ్గర ఉన్న సూట్ కేసులో ఓ యువతి మృతదేహం కనిపించడం తీవ్ర కలకలం రేపింది. ఆ మృతదేహాన్ని చూస్తే.. ఆమెను ఎవరో అత్యంత దారుణంగా హత్య చేసి సూట్ కేసులో పెట్టి పడేశారని పోలీసులు భావిస్తున్నారని అంటున్నారు. ఈ సమయంలో.. మృతురాలు కాంగ్రెస్ నాయకురాలని గుర్తించారు!వాస్తవానికి తొలుత మృతురాలిని గుర్తించనప్పటికీ.. అనంతరం ఆమె కాంగ్రెస్ పార్టీ నాయకురాలని, ఆమె పేరు హిమాని నర్వాల్ అని పోలీసులు వెల్లడించారు. అనంతరం ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో.. ఈ వ్యవహారం ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుందని అంటున్నారు.ఈ సమయంలో సంప్లా పోలీసులు, ఫోరెన్సిక్ బృందం ఈ హత్య కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఈ సమయంలో ఆమెను గొంతు నులిమి చంపినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని చెబుతున్నారు. ఇక.. ఈ హత్యకు వ్యక్తిగత శత్రుత్వమే కారణమా.. లేక ఏదైనా రాజకీయ కారణం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారని అంటున్నారు.ఈ సందర్భంగా స్పందించిన సంప్లా పోలీస్ స్టేషన్ ఇన్ ఛార్జ్ బిజేంద్ర సింగ్.. ఈ కేసును పరిష్కరించడానికి ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హిమానీ ఇంటి చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మరోపక్క సైబర్ టీమ్ ఆమె సోషల్ మీడియా అకౌంట్లను పరిశీలిస్తోందని అన్నారు.కాగా... హిమానీ నర్వాల్ చురకైన కార్యకర్తగా కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్రతో పాటు పార్టీలోని ప్రతీ ప్రధాన కార్యక్రమంలోనూ ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మరణాన్ని ఎమ్మెల్యే బీబీ బాత్రా ధృవీకరించారు. ఈ ఘటనపై సిట్ ఏర్పాటు చేసి దర్యాపు చేయాలని డిమాండ్ చేశారు.

## 'మా బావే నా మొగుడు..' వద్దమ్మా శాపం అంటున్న సైంటిస్టులు!

'ఏమేవ్.. కాలేజీలో ఎంతో మంది నీకు ప్రపోజ్ చేస్తున్నా..ఒక్కరికీ ఓ కే చెప్పడం లేదు. ఎందుకే నీకింత పొగరు.. " అంటూ శామిలిని కాస్త కోపంగా మందలించింది శ్యామల. "నా వెంట ఎంత మంది పడినా.. నా మనస్సు మా బావకు చిన్నప్పుడే ఇచ్చేశానే..మా బావే నా మొగుడని అప్పుడే ఫిక్స్ అయ్యా..నేను పుట్టినప్పుడే మా మేనత్త కొడుకు శ్యాంసుందర్ కు ఇచ్చి పెళ్లి చేస్తామని నాకు శామిలి అని పేరుపెట్టారే.." అని సిగ్గుల మొగ్గ అయ్యింది శామిలి. ఇలా బావామరదళ్లు, మేనమామ, కోడళ్ల సరసాలు, పెళ్లిళ్లు మన దగ్గర సహజమే. తెలిసిన వాళ్లనే పెళ్లి చేసుకుంటే ఏ ఇబ్బంది ఉండదు అని ఎక్కువ మంది కుటుంబాలు, యువతీయువకులు అనుకుంటూ ఉంటారు. అయితే ఇలాంటి మేనరికపు పెళ్లిళ్లు వద్దుంటున్నా శాస్త్రవేత్తలు. మేనరికపు వివాహాలు పుట్టే పిల్లలకు శాపంగా మారుతున్నాయని హెచ్చరిస్తున్నారు. దగ్గరి సంబంధం పెళ్లిళ్లు చేసుకుంటే పుట్టే పిల్లలకు జన్యువ్యాధులు వచ్చి జీవితం నరకప్రాయం అవుతుందని సూచిస్తున్నారు.అరుదైన జన్యు వ్యాధులకు సంబంధించి 2021లో కేంద్ర ప్రభుత్వం జాతీయ విధానాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా హైదరాబాద్ లోని నిమ్స్ సహ దేశంలోని 12 ఆస్పత్రులను జన్యువ్యాధులకు సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ లుగా ఎంపిక చేసింది. జన్యువ్యాధులతో వచ్చే చిన్నారులకు హైదరాబాద్ లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నొస్టిక్స్ లో జన్యు పరీక్షలు నిర్వహించిన అనంతరం నిమ్స్ లో చికిత్స అందిస్తున్నారు. నిమ్స్ కు జన్యువ్యాధులతో 2014లో 2,453 మంది వస్తే 2024లో ఆ సంఖ్య 12,042కు పెరిగింది. దీన్ని బట్టి అర్థం అయ్యేది మేనరికాల వల్ల జన్యువ్యాధులు పెరుగుతున్నాయని భావించవచ్చు.జన్యువ్యాధుల్లో ప్రధానంగా గౌచర్, విల్సన్ వ్యాధులు, కొందరిలో తలసేమియా, సికిల్ సెట్ అనిమియా వంటి వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయి. గౌచర్ వ్యాధిలో కొవ్వు విచ్ఛిన్నం చెందక ప్లీహం, కాలేయం వంటి అవయవాల్లో పేరుకుపోతుంది. దీంతో ఎముకలు బలహీనపడటంతో కీళ్ల వ్యాధులు దాడి చేస్తాయి. విల్సన్ వ్యాధి కాలేయంపై దాడి చేస్తుంది. కాపర్ నిల్వలు కాలేయంలో పేరుకుపోయి దాని పనితీరును దెబ్బతీస్తుంది. కొన్నాళ్లకు కాలేయ మార్పిడి చేయాల్సి వస్తుంది. దీనికి లక్షల ఖర్చు అవుతుందనే విషయం తెలిసిందే. కొన్ని సార్లు శిశువు తల్లి కడుపులో ఉన్నప్పుడే జన్యువ్యాధులు దాడి చేస్తున్నాయి. కొందరిలో పుట్టిన తర్వాత బయటపడుతున్నాయి. నిమ్స్ కు వచ్చే జన్యువ్యాధుల కేసుల్లో ఎక్కువ శాతం మేనరికాలు చేసుకున్న దంపతుల సంతానానివే కావడం గమనార్హం.జన్యువ్యాధులు రాకుండా ఉండాలంటే మేనరికపు వివాహాలు వద్దనే చెబుతున్నారు శాస్త్రవేత్తలు. ఒకే రక్త సంబంధీకుల మధ్య జరిగే వివాహాల్లో పేరెంట్స్ నుంచి పిల్లలకు, అలా తరతరాలకు డీఎన్ఏ వెళ్తుంది. జన్యువుల మ్యూటేషన్ తక్కువగా అనర్థాలకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. అందుకే తల్లిదండ్రులు శాస్త్రీయ ధోరణితో ఆలోచించి పిల్లలకు మేనరికం కాకుండా బయటి వారితో వివాహం జరిపిస్తేనే జన్యు వైవిధ్యంతో పుట్టే పిల్లలు ఆరోగ్యంతో ఉంటారని సూచిస్తున్నారు. అందుకే పిల్లలకు చిన్నప్పుడే "బావే నీ మొగుడు.. మరదలే నీ పెళ్లం" అని నూరిపోయకండి అంటున్నారు.

## ఏపీ బ్రాండ్ అంబాసిడర్ గా మీనాక్షి చౌదరి!... ఎంతవరకూ నిజం?

:తెలుగు సినిమాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన హీరోయిన్స్ లో ఒకరైన మీనాక్షి చౌదరిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా సాధికారత బ్రాండ్ అంబాసిడర్ గా నియమించబోతోందని శనివారం నుంచి పలు కథనాలు మీడియాలో ప్రత్యక్షమైన సంగతి తెలిసిందే. దీనిపై అధికారిక జీవో ఏదీ విడుదల కాకపోయినా ప్రచారం మాత్రం జరిగింది.ఇందులో భాగంగా... నాడు తెలంగాణ చేనేత బ్రాండ్ అంబాసిడర్ గా నటి సమంత పనిచేసినట్లుగా, ఏపీలో పూనమ్ కౌర్ ఉన్నట్లుగా.. ఏపీ మహిళా సాధికారత బ్రాండ్ అంబాసిడర్ గా మరోసారి టాలీవుడ్ నటిని నియమించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించిందని విస్తృత ప్రచారం జరిగింది. తాజాగా దీనిపై క్లారిటీ వచ్చింది.అవును... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా సాధికారత బ్రాండ్ అంబాసిడర్ హీరోయిన్ మీనాక్షి చౌదరిని నియమించబోతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై ఏపీ ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. ఈ సందర్భంగా.. ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ ఎక్స్ వేదికగా దీనిపై స్పష్టత ఇచ్చింది. ఈ ప్రచారం పూర్తిగా ఫేక్ అని తెలిపింది.ఈ సందర్భంగా... "ఆంధ్రప్రదేశ్ ఉమెన్ ఎంపవర్మెంట్ బ్రాండ్ అంబాసిడర్ గా హీరోయిన్ మీనాక్షి చౌదరిని నియమించారని సోషల్ మీడియాలో ప్రచారం పూర్తిగా ఫేక్. ప్రభుత్వం పేరుతో ఉద్దేశపూర్వకంగా ఇటువంటి తప్పుడు పోస్టులు పెడుతున్న వారిపైనా, ఫేక్ ప్రచారం చేస్తున్న వారిపైనా చట్టప్రకారం చర్యలు ఉంటాయి" అని తెలిపింది.

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

# అంతులేని ఆన్ లైన్ మోసాలు

2024లో ఆన్‌లైన్ మోసాలు భయానకంగా పెరిగాయి. వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటివాటిని స్కామర్లు దుర్వినియోగం చేస్తూ, నకిలీ ఖాతాలు, హానికరమైన లింకులు, ఏఐ ఆధారిత సాంకేతికతలతో ప్రజలను మోసం చేస్తున్నారు. ఫలితంగా భారీ ఆర్థిక నష్టాలు నమోదవుతున్నాయి. 2024 తొలి భాగంలోనే భారత్‌లో రూ. 11,000 కోట్లకు పైగా నష్టం సంభవించినట్టు అంచనా.రోజు కు 6,000 ఫిర్యాదులు 'నేషనల్ సైబర్ క్రైమ్' పోర్టల్‌లో నమోదవుతుండగా, అంతర్జాతీయంగా ఈ న ష్టం రూ. 85.49 లక్షల కోట్లకు చేరుకుంది. ఏఐ ఆధారిత మోసాల పెరుగుదలతో డీప్‌ఫేక్ టెక్నాలజీ, ఆటోమేటెడ్ ఫిషింగ్ పద్ధతులు వాళ్ల దుర్మార్గాలను మరింత ప్రమాదకరంగా మార్చాయి. సోషల్ మీడి యా వేదికలు స్కామర్లకు ప్రధాన కేంద్రాలుగా మా రాయి.పెట్టుబడి మోసాలు, ఉద్యోగ మోసాలు, డిజిటల్ లోన్ యాప్ మోసాలు వంటివి బలహీన వర్గాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. గూగుల్ యాడ్స్, ఫేస్బుక్ మార్కెట్ ప్లేస్ వంటి వేదికలు సైబ ర్ నేరగాళ్లకు అవకాశంగా మారాయి. దీనిని ఎదుర్కొనేందుకు భారత ప్రభుత్వం గూగుల్, మెటా వం టి టెక్ దిగ్గజాలతో కలిసి కఠిన చర్యలు చేపడుతున్నది.'నేషనల్ సైబర్ క్రైమ్' థ్రెట్ అనలిటికల్ యూని ట్ వారు బ్యాంకులు, పోలీసులతో కలిసి ఆర్థిక మోసాలను అరికట్టే ప్రయత్నం చేస్తున్నారు. సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్స్ రిపోర్టింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా 5.75 లక్షలమంది బాధితులకు రూ. 16 బిలియన్ల మేర నష్టపరిహారం అందినట్టు సమాచారం.సైబర్ మోసాల బారినపడకుండా ఉండేం దుకు అనుమానాస్పద లావాదేవీలను ధృవీకరించడం, నకిలీ సందేశాలను క్రాస్‌చెక్ చేయడం, సోష ల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం పంచుకోకూడదనే జాగ్రత్తలు తీసుకోవడం ప్రజలకు అవసరం. మోసానికి గురైతే వెంటనే బ్యాంకులు, పోలీసులకు ఫిర్యాదు చేయాలి. సైబర్ నేరాలను అరికట్టడానికి ప్రభుత్వ నియంత్రణ, టెక్ సంస్థల చర్యలు, ప్రజల అప్రమత్తత కీలకం అని అందరం గుర్తించాలి.ఇటువంటి మోసాలను వాట్సాప్ నంబర్ ట్రేస్ చేయడం ద్వారా కనిపెట్టవచ్చని పేరు వెల్లడి చేయడానికి ఇష్టపడని ఒక పోలీసు అధికారి వివరించారు. ఆయన గతంలో సీఐడీ సైబర్ క్రైమ్ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుగా పని చేశారు.ఇలాంటి కేసుల్లో సంబంధిత సర్వీస్ ప్రొవైడర్‌కు ఒక నోటీసు ఇచ్చి వివరాలను సేకరించవచ్చని చెప్పారు. అయితే, బాధితులు పోగొట్టుకున్న సొమ్ము రూ.50,000 ఉంటే దానిని కనిపెట్టేందుకు పోలీసులకయ్యే ఖర్చు సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుందని చెప్పారు.తోడు, నేరాలు చోటు చేసుకుంటున్న స్థాయిలో సిబ్బంది ఉండరు. దాంతో, తక్కువ మొత్తం ఉన్న కేసుల పై దృష్టి సారించి విచారణ చేసేందుకు జాప్యం జరగడం లేదా అలసత్వం చోటు చేసుకోవడమో జరుగుతుంది" అని వివరించారు.ఈ వెబ్ సైట్లు నిర్వహిస్తున్న వారు ప్రధానంగా నేరం చోటు చేసుకున్న ఊర్లోనో, రాష్ట్రంలోనో ఉండరు. పక్క రాష్ట్రాలు, లేదా కొన్నిసార్లు విదేశాల నుంచి కూడా తమ కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉంటారు. వారిని ట్రేస్ చేసిన తర్వాత చివరకు వారు ఎవరో నియమించిన సిబ్బంది అని తేలుతుంది. అసలు నేరస్తులను కనిపెట్టి పట్టుకోవడానికి చాలా సమయం పడుతుంది" అని చెప్పారు.సైబర్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యమని సూచించారు. ఆన్‌లైన్‌లో అపరిచితులు డబ్బు అడిగినప్పుడు ట్రాన్స్‌ఫర్ చేయకుండా ఉంటే మోసానికి గురికాకుండా ఉండవచ్చని చెప్పారు.ఇటీవల హైదరాబాద్‌లో "మీ కంపెనీ నుంచి డబ్బును దొంగిలించింది నేనే, నాకు సహకరించిన వారిని విడుదల చేస్తే మీ డబ్బును వాపసు చేస్తా" అంటూ హైదరాబాద్ కు చెందిన ఒక సంస్థకు ఒక సైబర్ నేరస్తుడు మెయిల్ పంపారు. భువనేశ్వర్ కేంద్రంగా ఈ నేరం జరిగినట్లు పోలీసులు తెలిపినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి.ఇలాంటి రక రకాల పర్సనల్, బిజినెస్, విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, వ్యాపార అవకాశాలు కల్పిస్తామని చెబుతూ జరిగే ఫ్రాడ్‌లు వార్తల్లో కనిపిస్తూనే ఉంది.కోవిడ్ లాక్‌డౌన్ తర్వాత టెక్నాలజీ వాడకం పెరిగింది. నిత్యావసర వస్తువుల నుంచి ఇళ్ల కొనుగోలు వరకూ అన్నీ ఆన్ లైన్ ట్రాన్సాక్షన్‌లు జరుగుతున్నాయి. మొబైల్ యాప్స్ వాడకం పెరిగింది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో అందించిన డేటా ప్రకారం భారతదేశంలో 2020లో 50,035 సైబర్ నేరాలు నమోదయ్యాయి. ఇది 2019 కంటే, 12 శాతం ఎక్కువ.టెక్నాలజీ వాడకంతో పాటు మోసాల సంఖ్య కూడా పెరిగిందని ఆంధ్ర యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ వి. వల్లీ కుమారి చెప్పారు.సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా మెసేజీలు లేదా లింక్ పంపించి ఆ లింక్ క్లిక్ చేయమని అడుగుతారు. లింక్ పై క్లిక్ చేసిన తర్వాత రిజిస్టర్ చేయమని అడుగుతుంది. కొన్నిసార్లు లింక్ క్లిక్ చేసిన తర్వాత ఓటీపీ ఎంటర్ చేయమని అడిగి దాని ద్వారా అకౌంట్‌లో డబ్బులను దొంగిలిస్తారని చెప్పారు.మొబైల్ ఎస్ఎంఎస్‌ల ద్వారా అపరిచితుల నుంచి వచ్చే లింక్‌లను క్లిక్ చేయకూడదని ప్రొఫెసర్ వల్లీ కుమారి సూచించారు. సాధారణంగా ప్రముఖుల అకౌంట్లను టార్గెట్ చేసి ఇలాంటి పనులకు పాల్పడుతూ ఉంటారని ఆమె చెప్పారు.ఒకామెకు ఒక సంస్థలో ప్రాజెక్ట్ లీడ్‌గా ఉద్యోగం వచ్చిందని చెబుతూ, అందు కోసం నౌకరీ.కామ్ వెబ్ సైటు ద్వారా రిజిస్టర్ చేసుకుని వివరాలను పొందుపరచాలని కోరారు. అయితే, ఈ వెబ్‌సైటులో లాగ్ ఇన్ అయినప్పుడు హెచ్టీటీపిఎస్ తో ఉండటంతో ఆ వెబ్ సైట్ నమ్మశక్యమైందేనని ఆమె అనుకున్నారు. కానీ, అందులోంచి వేరే లింక్ క్లిక్ చేసినప్పుడు వెళ్లిన వెబ్ సైటు హెచ్టీటీపిఎస్ లేకపోవడంతో, అక్కడ ఆమెను ఓటీపీ అడగడం, ఎంటర్ చేయడంతో అకౌంట్లో డబ్బులన్నీ పోగొట్టుకున్నారు.ఇలాంటి వెబ్ సైట్లు చూసినప్పుడు లో వెబ్‌సైట్ పేరు, యూఆరెల్ బాక్స్‌లో లాక్ సింబల్ తో పాటు హెచ్టీటీపిఎస్ అని ఉంటే ఆ వెబ్‌సైట్ వెరిఫై అయిందని అర్థం" అని ప్రొఫెసర్ వల్లీ కుమార్ వివరించారు.ఈ మెయిల్ ద్వారా, వాయిస్ కాల్స్ ద్వారా రక రకాల మోసాలు చోటు చేసుకుంటాయి. ఈ తరహాలో తెలిసిన వారి పేరుతో ఉన్నట్లుగానే డబ్బులు కావాలని అభ్యర్థిస్తూ మెయిల్ పంపిస్తారు. అందులో అర్జెంట్ గా డబ్బు అవసరముంది అని చెబుతూ అకౌంట్ కు డబ్బులు బదిలీ చేయమని అడుగుతారు. నేరుగా అడిగేందుకు మొహమాట పడి ఈ-మెయిల్ పంపారేమో అనుకుని చాలా మంది డబ్బు ట్రాన్స్ఫర్ చేస్తూ ఉంటారు. ఇందులో వారి పరిచితుల పేర్లతోనే ఈ మెయిల్ పంపిస్తూ ఉంటారు.ఆ ఈ మెయిల్ ను జాగ్రత్తగా గమనిస్తే ఒక అక్షరం, లేదా ఒక సింబల్ తేడా ఉంటుంది.ఈ-మెయిల్ ద్వారా డబ్బు పంపమని ఎవరు అడిగినా సదరు వ్యక్తులను అడిగి తెలుసుకోవడం ముఖ్యమని వల్లీ కుమారి సూచించారు.వాయిస్ కాల్ ద్వారా పెన్షన్ ప్లాన్, ఇన్సూరెన్సు, లాటరీలు, లేదా రిసార్ట్ లో ఫ్రీస్టే వచ్చిందని చెబుతూ పరిచయం లేని వారు కాల్ చేస్తారు. మీకొక ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ పంపించండి అని అడుగుతారు. నిజంగానే డబ్బులు వచ్చాయేమో అనుకుని ఆ ఓటీపీ పంపగానే వాళ్ళ అకౌంట్లలో డబ్బును తీసేస్తారు. ఆ వెంటనే మొబైల్ సిమ్ ను కూడా మార్చేస్తారని వల్లీ చెప్పారు.ఏ పరిష్కారమూ ఫూల్ ప్రూఫ్ అని చెప్పలేమని అంటూ, మాల్ వేర్స్ నుంచి తప్పించుకోవడానికి మొబైల్స్, ల్యాప్‌టాప్స్‌లో యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్ ఉండటం మంచిదని వల్లీ కుమారి చెప్పారు.ఆన్‌లైన్ మోసాల నుంచి తప్పించుకోవాలంటే ఓటీపీలు షేర్ చేయకుండా ఉండటం, అపరిచితులు పంపిన క్యూఆర్ కోడ్‌లు స్కాన్ చేయకుండా ఉండటం, యుపీఐ షేర్ చేయకుండా ఉండటం లాంటివి చేయాలని పోలీస్ అధికారి సూచించారు.అత్యాశ కూడా మోసాలకు దారి తీస్తుందని, అకస్మాత్తుగా వచ్చే డబ్బు కోసం ఆశ పడకుండా ఉండటం ముఖ్యమని అన్నారు.

# ఏఐతో వైద్య రంగంలో అద్భుతాలు.. వేగంగా వ్యాధి నిర్ధారణ, చికిత్సలు





మనిషి తన మేథస్సుతో (ఇంటెలిజెన్స్) నాటి నుంచి నేటి వరకు ఎంతో పురోగతి సాధించగా, ఇప్పుడు కృత్రిమ మేథ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ఏఐ) ప్రపంచాన్ని మరింత ఆధునికత వైపు తీసుకెళ్లనుంది. ఎన్నో రంగాల్లో కృత్రిమ మేథ అనివార్యం కాగా, ముఖ్యంగా వైద్యం, ఆరోగ్య సంరక్షణ రంగాన్ని ఇది కొత్త పుంతలు తొక్కించనుంది. రోగుల సంక్షేమం, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స ఇలా మొత్తంగా ఆరోగ్య నిర్వహణను వేగవంతం, సమర్థవంతంగా మార్చడమే కాదు, సులభతరం చేయనుంది. ఆరోగ్య సంరక్షణ, వైద్య సేవల్లో ఏఐ ఏ విధమైన మార్పులు తీసుకురానుందనే విషయాన్ని గమనించినట్టయితే..

**క్లిష్టమైన డేటాను ఏఐ సులభంగా విశ్లేషించగలదు**

**మానవ పరమైన తప్పిదాలకు చెక్**

**వైద్యుల పని సులభతరం**

**దీంతో రోగులకు మెరుగైన వైద్య సూచనలు**

**రోగి ఇంటి నుంచే చికిత్సలకు వెసులుబాటు**

**వేగంగా నూతన ఔషధాల పరిశోధన**

### వ్యాధి నిర్ధారణ పరీక్షలు/కచ్చితమైన చికిత్సలు

ఒక ల్యాబ్ టెక్నీషియన్ ఒక రోజులో కొన్ని నమూనాలనే పరీక్షించగలడు. కానీ, ఏఐ ఆధారిత మెషిన్లు తక్కువ సమయంలోనే వేలాది పరీక్షలు నిర్వహించగలవు. దీనివల్ల ఫలితాల్లోనూ కచ్చితత్వం పెరుగుతుంది. ఇదంతా ప్రోగ్రామింగ్ పైనే ఆధారపడి ఉంటుంది. ఒక వైద్యుడు ఒక రోగి కోసం మహా అయితే కొన్ని నిమిషాలే కేటాయించగలడు. రోజువారీగా ఉండే రోగుల రద్దీపైనే ఎంత సమయం వెచ్చించడం అన్నది ఆధారపడి ఉంటుంది. క్లిష్టమైన ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి వైద్యులు ఎన్నో పరీక్షలు రాస్తుంటారు. అవి చేయించుకుని రిపోర్టులు తీసుకెళ్లి ఇస్తే వాటిని వివరంగా చూసే తీరిక వారికి ఉండదు. వేగంగా పేజీలు తిప్పేసి మందులు రాసి పంపిస్తుంటారు. దీనివల్ల అన్ని సందర్భాల్లోనూ సమస్యలు వెంటనే నయం అవుతాయన్న గ్యారంటీ ఉండదు. కానీ ఏఐ దీన్ని మరింత సమర్థవంతంగా మార్చగలదు. ఒక రోగికి సంబంధించి ఇమేజ్ లు, రికార్డులు అన్నింటినీ ఏఐ పరిశీలించి ఒక చక్కని నివేదిక ఇవ్వగలదు. ఎక్స్ రే, ఎంఆర్ఐ, స్కాన్, సీటీ స్కాన్ ఇమేజ్ లను మనుషులతో పోలిస్తే ఏఐ మరింత కచ్చితంగా విశ్లేషించగలదు. దీనివల్ల మానవ తప్పిదాలను నివారించొచ్చు. ఇమేజ్ ల ఆధారంగా రోగికి ఉన్న సమస్యపై ఏఐ ఇచ్చిన నివేదికను రేడియాలజిస్టులు, ఇతర స్పెషలిస్ట్ వైద్యులు సులభంగా అర్థం చేసుకోగలరు. అవసరమైతే వారు కూడా మరోసారి వేగంగా ఇమేజ్ ను పరిశీలించగలరు. సమయం ఆదాకు తోడు కచ్చితత్వం ఇందులో సాధ్యపడుతుంది.

ఇప్పుడు చాట్ జీపీటీ ఏం చేస్తుందో చూస్తున్నారుగా.. ఏది అడిగినా దాదాపు చక్కని సమాచారాన్ని వేగంగా మన ముందు ఉంచుతోంది. ఆ సమాచారం అంతా కూడా నెట్ పేజీల నుంచే తెస్తోంది. అలాగే, వ్యాధి నిర్ధారణలోనూ ఒక రోగికి సంబంధించిన రికార్డులను ఏఐ టెక్నాలజీ అద్భుతంగా విశ్లేషించి, వేగంగా నివేదిక ఇవ్వగలదు. ఈ నివేదిక ఆధారంగా రోగికి ఎలాంటి చికిత్స అవసరమో డాక్టర్ సులభంగా నిర్ణయించి సూచించగలరు. అప్పుడు డాక్టర్లు, రోగుల సమయం కూడా ఆదా అవుతుంది. వైద్యులపై పని భారం తగ్గుతుంది. దాంతో వారు రోగుల సంరక్షణపై మరింత సమయం వెచ్చించగలరు. మెరుగైన వైద్యానికి వీలు పడుతుంది.

రోగికి సరైన ఔషధాలు సూచించడం చికిత్సలో అత్యంత కీలకమైన అంశం అవుతుంది. ఏఐ దీన్ని మరింత మెరుగుపరుస్తుంది. రోగి జన్యువులు, జీవనశైలి విధానం, వ్యాధి నిర్ధారణ పరీక్షల సమాచారం వీటన్నింటినీ ఏఐ విశ్లేషిస్తుంది. దీంతో విడిగా ఒక్కో రోగికి అనుకూలమైన, సమర్థవంతమైన చికిత్స అందించడం సాధ్యపడుతుంది. రోగి డేటా ఆధారంగా భవిష్యత్తులో రాబోయే ఆరోగ్య సమస్యలను కూడా ఏఐ టెక్నాలజీ ముందే గుర్తించగలదు. దీంతో వాటి నివారణపై దృష్టి పెట్టడం వీలవుతుంది.

### ఔషధ పరిశోధన వేగవంతం

ఒక కొత్త ఔషధాన్ని పరిశోధించి మార్కెట్లోకి తీసుకురావాలంటే కనీసం పదేళ్లు పడుతుంది. ఏఐ దీన్ని మరింత వేగవంతం చేయగలదు. క్లిష్టమైన బయోలాజికల్ డేటాను ఏఐ సులభంగా విశ్లేషించగలదు. అది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కనుక మనిషికి ఉండే పరిమితులు ఉండవు. తప్పులను దాదాపు నివారించొచ్చు. ప్రభావవంతమైన ఔషధాలను గుర్తించగలదు. వాటి సామర్థ్యాన్ని తేల్చగలదు. దీనివల్ల తక్కువ సమయంలోనే సమర్థవంతమైన నూతన ఔషధాలను తీసుకురావడం వీలు పడుతుంది. దీనివల్ల ఎంతో ఖర్చు ఆదా అవుతుంది. ముఖ్యంగా క్లినికల్ ట్రయల్స్ లో డేటా పరంగా ఏఐ ఎంతో ఉపయోగపడుతుంది. ఔషధ పరీక్షల్లో డేటాకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. అంతేకాదు ఒక ఔషధానికి సంబంధించి వేలు, లక్షలాది పేజీల డేటా ఉంటుంది. దీన్ని కచ్చితత్వంతో విశ్లేషించడం మనుషుల కంటే ఈ టెక్నాలజీయే సమర్థవంతంగా, వేగంగా చేయగలదు.

### టెలీ హెల్త్

ఏఐ వల్ల మరో సౌలభ్యం ప్రతిదానికీ రోగి వైద్యుడి వరకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. రోగి తాను ఉన్న చోట నుంచే ఈ టెక్నాలజీ సాయంతో వైద్యుడి సలహా, సూచనలు పొందొచ్చు. టెలీ హెల్త్ రూపంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈ సేవలను ఏఐ మరింత మెరుగుపరుస్తుంది. వేగవంతం చేస్తుంది. రోగి ఎక్కడున్నా, అతడికి సంబంధించిన తాజా సమాచారం ఏఐ ఆధారిత హెల్త్ గ్యాడ్జెట్ల (పరికరాలు) సాయంతో వైద్యుడికి చేరవేయగలదు. బ్లడ్ షుగర్, బీపీ, ఆక్సిజన్, హృదయ స్పందనలు తదితర ప్యారా మీటర్లు ఎలా ఉన్నదీ వైద్యులకు ఏఐ ఎప్పటికప్పుడు తాజా సమాచారం ఇస్తుంది. దాంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యుడు సూచిస్తాడు. ముఖ్యంగా వైద్య సేవలు అంతగా అందుబాటులో లేని మారుమూల ప్రాంతాలకు ఇది ఎక్కువ ఉపయోగకరం. మెరుగైన వైద్య సేవలను వేగంగా అందించడంలో సాయపడుతుంది. కొన్ని సర్జరీల తర్వాత రోగులు కోలుకోవడాన్ని ఏఐ టెక్నాలజీతో పర్యవేక్షించొచ్చు. గాయపడిన వారు, వైకల్యంతో బాధపడే వారు చికిత్సతో పొందుతున్న ఫలితాలను వైద్యులు రిమోట్ గా విశ్లేషించడం సాధ్యపడుతుంది.


### నిర్వహణ సులభతరం

వైద్యుల అపాయింట్ మెంట్, పేషెంట్ రికార్డుల నిర్వహణ, బీమా క్లెయిమ్ ల వ్యవహారాలు చూడడాన్ని ఏఐ చేయగలదు. దీనివల్ల విలువైన మానవ వనరులను ఆదా చేసుకోవచ్చు. దీనివల్ల ఖర్చు కూడా తగ్గుతుంది.

### వైద్య విద్య కొత్త పుంతలు

వైద్య విద్యలో ప్రాక్టికల్స్ కు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఏఐ దీన్ని నవీకరించగలదు. మెడికల్ కోర్సులు చేసే అభ్యర్థులకు నేర్చుకోవడాన్ని సులభతరం చేస్తుంది. వర్చువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ ఇందుకు సాయపడతాయి. ఇవి కాకుండా వైద్య రంగంలో సరఫరా వ్యవస్థ ఎంతో కీలకమైనది. కరోనా వచ్చినప్పుడు సప్లయ్ చైన్ లో సమస్యలను చూశాం. కానీ, ఏఐ టెక్నాలజీ విరివిగా అందుబాటులోకి వస్తే సప్లయ్ చైన్ మరింత బలపడుతుంది. ఔషధాలు, ఉపకరణాలు తదితర ఇన్వెంటరీ నిర్వహణ, అసలు డిమాండ్ ఎంత మేర ఉంది, దానికి తగ్గట్టు వేగంగా సరఫరా ఎలా చేయాలి? అనేది ఏఐతో సులభతరం అవుతుంది. దీనివల్ల సమయం, ఖర్చు ఆదా అవుతుంది. వైద్య రంగంలో వస్తున్న మార్పులు, కొత్త వ్యాధులు ప్రబలడం తదితర సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరిస్తూ, విశ్లేషిస్తూ ముందస్తు నివారణ చర్యలను సైతం ఏఐ సూచించగలదు.







# పీసీని తెగ ఫాలో అవుతున్నారుగా..!



ఐశ్వర్యా మీనన్ లుక్ మీకు ఊపిరి పోస్తుంది



బాలీవుడ్ సినిమాలతో పాపులర్ అయ్యి ఆ క్రేజ్ తో హాలీవుడ్ బాట పట్టింది ప్రియాంకా చోప్రా. అక్కడికి వెళ్లడం ఒక ఎత్తైతే అక్కడ పాప్ సింగర్ ని పెళ్లాడటం వల్ల అమ్మడి రేంజ్ మారిపోయింది. అంతకుముందు తన మొదటి ఆప్షన్ బాలీవుడ్ మాత్రమే ఉండేది కానీ ఇప్పుడు అది ఆఖరి ఆప్షన్ అయ్యింది. ఈ పదేళ్ల కాలంలో ప్రియాంకాకు ఎన్నో బాలీవుడ్ ఆఫర్లు ఇచ్చినా ఆమె సింపుల్ గా నో చెప్పేసిందట. ఐతే ఇన్నాళ్లకు మళ్లీ పీసీని ఇండియన్ స్క్రీన్స్ పై చూడబోతున్నాం అది కూడా మన సూపర్ స్టార్ మహేష్ బాబు సినిమాలో అమ్మడు ఛాన్స్ కొట్టేసింది. అందుకే ప్రియాంక కూడా మామూలుగా ఐతే ఒప్పుకునేది కాదు కానీ జక్కన్న ప్లాన్ తెలుసు కాబట్టే ఓకే అనేసింది. ఐతే ఇన్నాళ్లు హాలీవుడ్ సినిమాలు, సీరీస్ లు చేస్తూ వచ్చిన ప్రియాంక ఈమధ్య ఇక్కడ ఆడియన్స్ తో అంత టచ్ లో లేదు. సునీల్ శెట్టి ఐతే ఎప్పుడైతే మహేష్ రాజమౌళి కాంబో సినిమాకు సైన్ చేసిందో మళ్లీ అమ్మడు ఇప్పుడు ఇక్కడ ఫ్యాన్స్ ని అలరిస్తుంది. తన ప్రతి అప్డేట్ ని ఇన్ స్టాలో షేర్ చేస్తూ వస్తున్న పీసీ 29 సినిమా ఓకే చేశాక ఇంకాస్త ఫాలోవర్స్ ని పెంచుకున్నట్టు తెలుస్తుంది. అందుకే ఈ ఫాలోవర్స్ కి ఎంగేజ్ అయ్యేలా ఇండియాలో తన ట్రిప్స్, తను వెళ్తున్న ప్రదేశాల గురించి షేర్ చేస్తుంది. మహేష్ తో ప్రియాంక చోప్రా చేస్తున్న ఈ సినిమాపై ఆకాశాన్ని అంటే అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను ఇప్పటికే మొదలు పెట్టగా త్వరలో ఫారిన్ షెడ్యూల్ ఉండబోతుందని తెలుస్తుంది. తప్పకుండా ప్రియాంక చోప్రాకి ఇది మంచి సినిమానే అయ్యేలా ఉంది. ఐతే ఈ సినిమాతో హాలీవుడ్ లో కూడా ప్రియాంక క్రేజ్ ని వాడుకునే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. మరి రాజమౌళి మహేష్ సినిమా తర్వాత మళ్లీ ప్రియాంక వరుస సినిమాలు ఇక్కడ చేస్తుందా లేదా అన్నది చూడాలి.



అదితి బుధతోకి సంప్రదాయ సొబగుల్లో అబ్బురపరుస్తుంది

# నాగార్జున కూడా ఇంత లేట్ అయితే ఎలా..?



టాలీవుడ్ కింగ్ నాగార్జున నా సామిరంగ సినిమా తర్వాత నెక్స్ట్ ప్రాజెక్ట్ ని ఫైనల్ చేయడానికి టైం తీసుకుంటున్నారు. ఓ పక్క కోలీవుడ్ లో కూలీ సినిమాలో ఇంపార్టెంట్ రోల్ చేస్తున్నాడు నాగ్. దాదాపు అది నెగిటివ్ రోల్ అన్న టాక్ వినిపిస్తుంది. అయినా సరే లోకేష్ కనకరాజ్ సినిమా కాబట్టి ఆ పాత్రలో నాగార్జున ఎలా ఉంటారా అన్న ఆసక్తి ఫ్యాన్స్ లో ఉంది. మరోపక్క కుబేర సినిమా కూడా చేస్తున్నాడు. ధనుష్ హీరోగా వస్తున్న కుబేర సినిమాలో కూడా నాగార్జున కీలక పాత్ర చేస్తున్నట్టు తెలుస్తుంది. ధనుష్ కుబేరల్లో కథను మలుపు తిప్పే పాత్ర కాబట్టే నాగార్జున ఒప్పుకున్నారని తెలుస్తుంది. ఐతే తమిళ్ లో రెండు సినిమాలు చేస్తున్న నాగ్ తెలుగులో ఒక్క సినిమాను మొదలు పెట్టలేదు. నాగార్జున లాంటి సీనియర్ హీరో కూడా కథల ఎంపికలో ఇంత లేట్ చేయడం ఫ్యాన్స్ ని ఇబ్బంది పెడుతుంది. అక్కినేని ఫ్యాన్స్ కూడా నాగార్జున చేస్తున్న ఈ లేట్ కి అసంతృప్తిగా ఉన్నారు.

అఖిల్ కూడా ఏజెంట్ వచ్చి రెండేళ్లు దాటినా మరో సినిమా ఊసేలేదు. నాగార్జున కూడా అదే దారిలో వెళ్తున్నారు. మరి ఇలా ఎందుకు జరుగుతుంది అని అక్కినేని ఫ్యాన్స్ కన్ ఫ్యూజన్ లో ఉన్నారు. మరోపక్క నాగ చైతన్య తండేల్ తో 100 కోట్ల సినిమా చేశాడు. తండేల్ సక్సెస్ తో అక్కినేని ఫ్యాన్స్ లో జోష్ మొదలైంది. నాగార్జున, అఖిల్ టైం పాస్ చేస్తున్నా నాగ చైతన్య మాత్రం సినిమా వెంట సినిమా చేస్తూ వస్తున్నాడు. నాగార్జున నెక్స్ట్ సినిమా కోసం ఫ్యాన్స్ అంతా ఎంతో ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. ఒకరిద్దరు దర్శకులతో కథా చర్చలు జరుగుతున్నాయని తెలుస్తున్నా ఏది ఫైనల్ అవ్వకపోవడంతో ఫ్యాన్స్ కాస్త నిరుత్సాహంగా ఉన్నారు. మరి నాగార్జున నెక్స్ట్ సినిమా ఏది అవుతుంది ఎవరి డైరెక్షన్ లో వస్తుంది అన్నది చూడాలి. నాగార్జున మాత్రం ఈసారి కూడా కొడితే సూపర్ హిట్టే కొట్టాలి అన్నట్టుగా చూస్తున్నాడు. మరి అది ఎలా సెట్ అవుతుంది అన్నది చూడాలి. నాగార్జున అఖిల్ స్పీడ్ పెంచి వరుస సినిమాలు చేస్తే ఫ్యాన్స్ డబుల్ జోష్ అందుకునే ఛాన్స్ ఉంటుంది.